జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 08, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




- రూ.92 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి
- మదర్ డైయిరీ, శ్రీజ మహిళా మిల్క్ సంస్థ ఏర్పాటుతో వేల మందికి ఉద్యోగాలు
- టాటా సంస్థ సహకారంతో మెరుగైన వైద్య సేవలు
- 40 ఏళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పమే ప్రయోగశాల
- కుప్పం సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

## ఆదర్శ నియోజక వర్గంగా ‘కుప్పం’

**కుప్పం, మహానాడు:** ‘నన్ను గుండెల్లో పెట్టుకుని ఇంతవాణ్ణి చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకునేందుకే స్వర్ణకుప్పం విజన్ -2029 డాక్యుమెంట్ రూపొందించా. పేదరిక నిర్మూలన, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణా కేంద్రాలు, అందరికీ విద్య

మిగతా.. 2లో

మహానాడు ఫోకస్

# బావగారూ.. బాగున్నారా?

- కార్మిక శాఖలో ఇంకా ‘రెడ్డి’ కార్పెట్
- కూటమి పాలనలోనూ ఇంకా రెడ్డి అధికారులదే హవా
- ఏళ్ల తరబడి అక్కడే కొనసాగుతున్న ఉన్నతాధికారులు
- అవినాష్‌రెడ్డి దన్నుతో చక్రం తిప్పిన అధికారికే అందలం
- నాటి మంత్రి జయరాం వద్దని పంపిన అధికారికి పెద్దపీట
- సొంత జిల్లాల్లోనే పోస్టింగులు
- బదిలీల గోల.. బావగారి లీల
- కార్మిక శాఖలో బావ గారి పెత్తనం



(మార్తి సుబ్రహ్మణ్యం)

జగన్ జమానా మారి కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ ఇంకా కొన్ని శాఖల్లో వైసీపీ వాసనలు కొనసాగుతున్నాయి. వైసీపీ హయాంలో అవినాష్ రెడ్డి, పెద్దిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, విథున్‌రెడ్డి, విజయ సాయిరెడ్డి, బొత్స, ద్వారంపూడి అండ్ అదర్స్‌కు వీరవిధేయులుగా చెలామణి అయిన కొందరు ఉన్నతాధికారులు.. ఆ పార్టీ అధికారంలో లేకపో యినప్పటికీ, ఇంకా దర్జాగా అదే స్థానాల్లో కొనసాగుతున్న వైనంపై..‘మంచి ప్రభుత్వం’ పెద్దమనసుతో కరుణించడం మీడియాలో రచ్చవు తోంది. అందులో పరిశ్రమలతో సంబంధం ఉన్న కార్మికశాఖ ఒకటి. పార్టీ-ప్రభుత్వానికి అప్రతిష్ట తీసుకువచ్చే చర్యలకు పాల్పడవద్దని.. సీఎం చంద్ర బాబునాయుడు పదే పదే చేస్తున్న హెచ్చరికలు కొన్ని శాఖల చెవికెక్కడం లేదు. మంత్రులు-అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్న సీఎం ఆదేశాలు బేఖాతరవుతున్న వైచిత్రి. మంత్రులు తమ బంధు మిత్రులను దూరంగా ఉంచాలన్న బాబు ఆదేశాలు, బుట్టదాఖలవుతున్న పరిస్థితి కొన్ని శాఖల్లో కొనసాగుతోందన్న చర్చ జరుగుతోంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడునెలల వుతున్నప్పటికీ.. జగన్ జమానాలో చక్రం తిప్పిన అధికారులే ఇంకా కార్మికశాఖలో తిష్టవేసిన వైన మిది.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ ఇంకా పాతవాసనలు పోని శాఖల్లో.. కార్మిక శాఖ ఒకటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జగన్ జమానాలో కడప ఎంపి అవినాష్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి దన్నుతో కీలకమైన పోస్టింగులు తెచ్చుకున్న రెడ్డి సామాజికవర్గ అధికారులు.. ఇంకా అదేచోట దిగ్విజయంగా కొనసాగుతున్న వైనంపై, ఆ శాఖ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక శాఖలోచక్రం తిప్పుతున్న ‘బావగారు’ వీరికి దన్నుగా ఉన్నట్లు కార్మిక శాఖలో ప్రచారం జరుగుతోంది. బావగారిని సంతృప్తి పరిస్తే చాలు.. కార్మిక, ఫ్యాక్టరీస్, బాయిలర్ విభాగాల్లో ఏ పనులైనా వాయువేగంతో జరిగిపోతున్నాయన్న ప్రచారం జరుగుతోంది.

జగన్ జమానాలో కార్మిక శాఖలో కీలక హోదాలో పనిచేసిన పలువురు రెడ్డి సామాజికవర్గ ఉన్నతాధికారులు.. వైసీపీ ఓడిపోయి, కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ..

మిగతా.. 2లో

## బీజేపీ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల రాళ్ల దాడి

- బీజేపీ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ
- కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం తలకు గాయాలు
- బీజేపీ అగ్రనేతల ఆగ్రహం



**హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర నడిబొడ్డులోని నాంపల్లిలో తొలిసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గాంధీభవన్‌కు ఎదురుగా ఉన్న బీజేపీ రాష్ట్ర కార్యాలయంపైకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకువచ్చే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా రాళ్లదాడికి దిగగా, బీజేపీ కార్యకర్తలు దానిని ప్రతిఘటించారు. ఆ ప్రయత్నంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయమవగా, ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రాష్ట్ర రాజధాని నగర నడిబొడ్డులో జరిగిన ఈ దాడి ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది.

నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదురి ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ కార్యాలయంపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి

మిగతా.. 9లో

## నేడు ఏపీలో ప్రధాని మోడీ పర్యటన

**అమరావతి, మహానాడు:**



భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు విశాఖపట్నం సిద్ధమైంది. ఇప్పటికే ప్రధాని మోడీ సభా ప్రాంగణాన్ని ఎస్‌పీజీ స్వాధీనం చేసుకుంది. ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్‌కు రెండు కిలోమీటర్ల పరిధిలో స్థానిక ప్రజలకు ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. బయట నుండి వచ్చే వ్యక్తులపై నిఘా ఉంచారు. ఇక, నేడు, రేపు సభా పరిసర ప్రాంతాల్లో నో ప్రయివేట్ డ్రోన్ ప్లై విధించారు. అయిదు వేల మంది పోలీసులు బందోబస్తు చేయనున్నారు. కార్యక్రమాన్ని 35 మంది ఐపీఎస్ అధికారులు పర్యవేక్షించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధాని కంటే ముందుగానే విశాఖచేరుకోను న్నారు. ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలికి, ఆ తర్వాత రోడ్‌షోలో పాల్గొనున్నారు.


## ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నా..

- ప్రజలందరికీ న్యాయం చేయడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత
- పార్టీ కోసం సేవ చేసిన వారికి నామినేటెడ్ పదవులతో న్యాయం చేస్తా
- ప్రజలకు సుపరిపాలన అందించడం కోసమే ‘జన నాయకుడు’ పోర్టల్
- మరో పార్టీ సింబల్ తెలియని నియోజకవర్గం కుప్పం
- మారుమూల ప్రాంతమైన కుప్పాన్ని దేశానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- 2వ రోజు కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**కుప్పం, మహానాడు:** గత ఐదేళ్లలో ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నానని, ఓట్లేసి గెలిపిం చిన ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలం దరికీ సుపరిపాలన అందించడమే లక్ష్యంగా జన నాయ కుడు పోర్టల్‌ను రూపొందించామని, మొదటి కుప్పంలో దీన్ని అమలు చేసి ఆపై రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లోనూ అందుబాటులోకి తెస్తా మని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కుప్పం ప్రజల రుణం

మిగతా.. 2లో



## ‘బుక్స్’ బరువొద్దు!

- భారం తగ్గేలా నాణ్యత పెంచండి!
- ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా సంస్కరణలు
- ఉన్నత విద్యలో క్యూఎస్ ర్యాంకింగ్స్ లక్ష్యంగా మార్పులు
- కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళిక ప్రక్షాళనకు కసరత్తు
- స్కూలు, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యపై మంత్రి లోకేష్ సమీక్ష

**అమరావతి, మహానాడు:** పాఠశాల విద్య స్థాయిలో బాలలకు పుస్తకాల బరువు తగ్గించి నాణ్యత పెంచేలా నూతన పాఠ్య ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. 2025-26 విద్యాసంవత్సరంలో కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళిక

మిగతా.. 3లో



03
ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఏబీవీ ఆత్మీయ సమ్మేళనం


08
సుపరిపాలన దిశగా అధికారులు పని చేయండి


08
సుప్రీంకోర్టులో కేటీఆర్ పిటిషన్


## రెన్యువబుల్ ఎనర్జీలో నైపుణ్యాభివృద్ధికి సుజ్లాన్‌తో భాగస్వామ్యం!

- విండ్ ఎనర్జీలో అంతర్జాతీయస్థాయి అవకాశాలకు దోహదం
- మంత్రి లోకేష్ సమక్షంలో సుజ్లాన్- ఏపీఎస్ఎస్డీసీ అవగాహన ఒప్పందం

**అమరావతి, మహానాడు:**

ఏపీలో దేశంలోనే అతిపెద్ద విండ్ ఎనర్జీ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్డీసీ) నడుమ ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాలు ఎంఓయు చేసుకున్నారు. వచ్చే నాలుగేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌ను విండ్ ఎనర్జీ నైపుణ్యాల కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా సుజ్లాన్ సహకారంతో యాంత్రిక, ఎలక్ట్రికల్, బ్లేడ్ టెక్నాలజీ, సివిల్, లైసెనింగ్ వంటి కీలక రంగాల్లో 12వేల మందికి శిక్షణ ఇస్తారు. యువత, మహిళలు, ఎస్‌టీఈఎం గ్రాడ్యుయేట్స్ చురుకైన



భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఒప్పందం ముఖ్యోద్దేశం.

క్లీన్ ఎనర్జీలో జాతీయ, అంతర్జాతీయ అవకాశాల కోసం గ్లోబల్ నైపుణ్యాలను పెంపొందించడమే ఎంఓయు ప్రధాన లక్ష్యం విండ్ ఎనర్జీలో పేరొందిన సుజ్లాన్ సంస్థ ఇప్పటికే భారతదేశం, ప్రపంచంలోని అనేక

మిగతా.. 3లో

జనం గుండె చప్పుడు
మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 08, జనవరి 2025

# ఢిల్లీలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటన

**రవాణా వ్యవస్థపై క్షేత్ర స్థాయిలో సమీక్ష**

**రోడ్డు భద్రతా విధి విధానాలపై మంత్రి పరిశీలన**

**తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రోడ్లు పరిశీలన చేసిన రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి**



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పర్యటనలో భాగంగా ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ అధ్యక్షతన జరుగుతున్న 42వ ట్రాన్స్‌పోర్ట్ డెవలప్మెంట్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ మంత్రి పాల్గొన్న అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధి విధానాలపైన రవాణా వ్యవస్థపై క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. రోడ్డు రవాణా భద్రత పట్ల తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారు కేంద్రం అనుసరిస్తున్న సాంకేతికతను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా శాఖ మంత్రులకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# కుప్పం ప్రజల సమస్యల పరిష్కారానికి ఇక ‘జన నాయకుడు’

- సరికొత్త కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం
- రోజుల్లోనే సమస్య పరిష్కారించేందుకు ఫాలోఅప్ టీం...
- డ్యాష్‌బోర్డులో సీఎం స్టేటస్ తెలుసుకునేలా రూపకల్పన

**కుప్పం, మహానాడు:**

ప్రజల సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యంగా కుప్పం సరికొత్త కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. దానిపేరే జన నాయకుడు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా తన నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే అని సీఎం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, ముఖ్య మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి సొంత నియోజకవర్గంలో నిత్యం అందుబాటులో ఉండటం అసాధ్యం. అయినప్పటికీ ఇప్పటికే చంద్రబాబు తనకున్న వ్యవస్థను ఉపయోగించి దృష్టికి తీసుకొచ్చిన వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం మనం ఇప్పటి వరకూ చూశాం. అయితే, ఈ సారి మరో




వినూత్న కార్యక్రమానికి తెరతీశారు. ప్రజలు వచ్చి నేరుగా తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రజానాయకుడు పేరుతో పార్టీ కార్యాలయంలో కొత్త విధానాన్ని తీసుకొచ్చారు.

సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీల స్టేటస్‌ను తన డ్యాష్ బోర్డులో కూడా చూసుకునేలా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ జన నాయకుడు కోసం ప్రత్యేకంగా సిబ్బందిని కార్యాలయంలో నియమించారు. తమ సమస్యలపై అర్జీలతో పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజలను సాదరంగా సంబంధిత సిబ్బంది రిసీవ్ చేసుకుంటుంది. సమస్యలపై వచ్చారు కదా అని కసురుకోకుండా కూర్చోబెట్టి వారికి తాగడానికి ఓ కాఫీ లేదా టీ ఇచ్చి గౌరవంగా చూస్తారు. వచ్చిన వారిని వారి సమస్యను జననాయకుడు అనే అప్లికేషన్‌లో రాస్తారు. ఇక్కడ ఐదుగురు ఎంగేజ్మెంట్ అధికారులు ఉంటారు. వీరికిలో ఒక్కొకరికి ఆరు విభాగాలు కేటాయించారు.

ఎంగేజ్మెంట్ ఆఫీసర్లు ప్రజల సమస్యను ఓపిగ్గా విని పోర్టల్‌లో పొందుపరుస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు పరిష్కరించదగిన సమస్యలైతే వాటిని పీజీఆర్ఎస్‌కు పంపిస్తారు. పార్టీ తరపున చేయవలసిన పనులైతే వెంటనే పార్టీ నాయకత్వం దృష్టి సారించి చర్యలు తీసుకుంటుంది. సమస్యను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో కూడా రసీదు కాపీపై బాధితులకు తెలియజేస్తారు. రసీదు ఇచ్చేశాం... మా పని అయిపోయిందన్నట్టు కాకుండా దీనికి మరో ప్రత్యేక టీం కూడా ఉంటుంది. అదే ఫాలోఅప్ టీం. ఈ ఫాలోఅప్ టీం సంబంధిత అధికారులను నిత్యం సంప్రదిస్తూ సమస్యను సకాలంలో పరిష్కరమయ్యేలా చూస్తారు.

### నేరుగా ముఖ్యమంత్రి పరిశీలించేలా...

ప్రతి అర్జీ, పరిష్కారం ఎంత వరకు వచ్చిందనేది నేరుగా సీఎం చూసేలా డాష్ బోర్డ్ కూడా ఏర్పాటు చేశారు. దీన్ని బట్టి సమస్యలు సత్వరం పరిష్కారం అవుతున్నాయా...లేదా అన్నదాన్ని సీఎం ప్రత్యక్షంగా చూడొచ్చు. నేరుగా



అక్కడికి రాలేని వాళ్ల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా జన నాయకుడుకు వచ్చిన సమస్యల పరిష్కారంపై కాల్ సెంటర్ నుంచి అర్జీదారులకు ఫోన్ చేసి వారి అభిప్రాయం కూడా తీసుకుంటారు. సంతృప్తిగా ఉన్నారా... అసంతృప్తిగా ఉన్నారా... అసంతృప్తిగా ఉంటే దానికి గల కారణాలను తెలుసుకుంటారు. మీడియాలో వచ్చే ప్రజాసమస్యలను కూడా గుర్తించి సూమోటోగా జననాయకుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.


# ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నా..

(మొదటిపేజీ తరువాయి..)

నేను తీర్చుకోలేను. నన్ను ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో మరో పార్టీ జెండా ఎగరలేదు. రాబోయే ఐదేళ్లలో కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా స్వర్ణ కుప్పం విజన్ -2029కి రూపకల్పన చేశాం. ఇప్పుడు కుప్పం ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయడం కోసం జన నాయకుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

### నాపై మూడు బాధ్యతలున్నాయి

నేను పార్టీ అధ్యక్షుడిని. కుప్పం ఎమ్మెల్యేని. రాష్ట్ర ముఖ్యమంత్రిని. నాపై మూడు రకాల బాధ్యతలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కార్యకర్తలు మేమిచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లేయించారు. పార్టీ అధ్యక్షుడిగా ఆ హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. అలాగే కుప్పం ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజల బాగోగులు నేను చూసుకోవాలి. స్థానికులు వారి సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చేందుకు వీలుగా జన నాయకుడు పోర్టల్ తీసుకొచ్చాం. ఇక్కడ నా పీఏ, అధికారులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు. నేను ఎమ్మెల్యేగా చేయాల్సిన బాధ్యతలను వారు నాకు ఎప్పటికప్పుడు తెలియజేస్తుంటారు.



తద్వారా బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తాను. ఇక ప్రభుత్వ సమస్యలన్నీ పీజీఆర్ఎస్‌కు వెళతాయి. గ్రీవెన్స్, భూ సమస్యలు, సీఎంఆర్ ఎఫ్ వంటివి ప్రభుత్వం చూస్తుందన్నారు.

### టీడీపీ కార్యకర్తలను ఎంటర్ ప్రెన్యూర్‌గా తయారుచేస్తాం

పార్టీని తమ భుజాలపై మోస్తున్న కార్యకర్తలను ఎంటర్ ప్రెన్యూర్లుగా తయారుచేస్తాం. టీడీపీ సభ్యత్వాలు కోటికి చేరువగా రావడం సంతోషాన్నిస్తోంది. టీడీపీకి కార్యకర్తలే బలం. కష్ట సమయంలో పార్టీకి అండగా నిలబడ్డకార్యర్తలను కుటుంబసభ్యుల్లా చూసుకుంటున్నాం. ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నాం. వారి పిల్లల చదువులు, ఉద్యోగ, ఉపాధికి ఆర్థిక చేయూత అందిస్తున్నాం. పార్టీకి సేవ చేసిన వారందరికీ న్యాయం చేస్తాం. పార్టీ కార్యకర్తలకు ఆమోదయోగ్యమైన వారికే పదవులు ఇస్తామని చంద్రబాబు తెలిపారు.

### వ్యవస్థలను నాశనం చేసి పోయారు

గత పాలకులు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు. అప్పులకుప్పగా రాష్ట్రాన్ని మార్చేశారు. అరాచక పాలనను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధించారు. జైలు పాల్జేశారు. చివరకు మీడియా ప్రతినిధులపైనా కేసులు పెట్టారు. ఒక ఆర్డర్ తెచ్చి మీడియాపై కేసులు ఎత్తి వేస్తాం. భూముల దస్త్రాలన్నింటినీ తారుమారు చేసిన ఘనలు వైసీపీ నేతలు. భూములను కబ్జా చేసేశారు. రెవెన్యూ సదస్సుల్లో ఆ దస్త్రాలన్నింటినీ సరిదిద్దుతున్నాం. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొస్తున్నాం. రాష్ట్రంలో కరువును పారద్రోలి, నీటి భద్రత కల్పించేందుకు గోదావరి పెన్నా నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టాం. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకొస్తాను. ఆపై కుప్పానికీ నీరు అందిస్తాను. అలాగే హంద్రినీవా పనులను జూన్ కల్లా పూర్తి చేసి కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

# బావగారూ.. బాగున్నారా?

(మొదటిపేజీ తరువాయి..)

ఇంకా నిక్షేపంలా అదే చోట కొనసాగుతున్న వైనం, కార్మిక శాఖలో చర్చనీయాంశమయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, పోలీసుశాఖలో కానిస్టేబుల్ నుంచి అన్ని శాఖల్లోనూ బదిలీలు జరిగాయి.

జగన్ హయాంలో పనిచేసిన అధికారులు, సిబ్బందిని మరో చోటకు బదిలీ చేయడమో, అసలు పోస్టింగులు ఇవ్వకుండా వీఆర్‌లో పెట్టడమో జరిగింది. కానీ కార్మికశాఖలో మాత్రం అందుకు భిన్నంగా.. వైసీపీ జమానాలో పనిచేసిన రెడ్డి సామాజికవర్గ అధికారులే ఇంకా కొనసాగించడం విశేషం. ఇదంతా కార్మికశాఖలో చక్రం తిప్పుతున్న ‘బావగారి’ మహత్యమేనన్న ప్రచారం జరుగుతోంది.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి జాయింట్ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా.. కర్నూలు జిల్లాకు చెందిన శివశంకర్‌రెడ్డి గత సర్కారు హయాంలో, కడప ఎంపి అవినాష్‌రెడ్డి సిఫార్సుతో ఆ పోస్టింగ్ దక్కించుకున్నారు. ఆ మేరకు అవినాష్‌రెడ్డి ఆయనకు సిఫార్సు లేఖ కూడా ఇచ్చారు. అనారోగ్య కారణాలు చూపించి ఆయన, తాను కోరుకున్న చోటకు బదిలీ చేయించుకున్నారు. ఎంపి అవినాష్‌రెడ్డి దన్ను ఉన్నందున, సహజంగా ఆయన హవా గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదని, ఆ శాఖ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఇంకా ఆయనను అక్కడే కొనసాగించడం విశేషం.

ఇక గుంటూరు, ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు సంబంధించి డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా.. కర్నూలు జిల్లాకే చెందిన శివకుమార్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం ఆ జిల్లాలో చేరారు. ఆయన వైసీపీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరించేవారంటూ, దానికి సంబంధించి ఆయన పాల్గొన్న ఫొటో ఒకటి అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. విచిత్రంగా ఆయన కోసం శ్రీకాకుళంకు చెందిన ఒక బీసీ అధికారిని సస్పెండ్ చేశారట. ఆయన స్థానంలో రెడ్డిగారిని నియమించిన వైసీపీ సర్కారుపై, సస్పెండయిన బీసీ అధికారి హైకోర్టుకు వెళ్లి.. తన సస్పెన్షన్‌ను సవాల్ చేసి, పోస్టింగు తెచ్చుకోవలసి వచ్చిందని కార్మిక శాఖ వర్గాలు గుర్తు చేశాయి.

చిత్తూరు జిల్లా ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా.. వైసీపీ హయాంలో చేరిన శివశంకర్‌రెడ్డి అప్పటిమంత్రి పెద్దిరెడ్డి బంధువు రాజశేఖర్‌రెడ్డి దన్నుతో, అక్కడ పోస్టింగ్ తెచ్చుకున్నారన్న ప్రచారం జరిగింది. అప్పటినుంచి అన్ని ఫ్యాక్టరీలు మంత్రి గారి బంధువు సేఫ్టీ థర్డ్ పార్టీ ఏజెన్సీకే వర్కు ఇవ్వాల్సిందేనట. ఈ ఏజెన్సీ హవా కడప నుంచి కృష్ణా జిల్లా వరకూ విస్తరించిందంటే.. జగన్ జమానాలో ఎంత హవా నడిచిందో ఊహించుకోవచ్చంటున్నారు. వైసీపీ అధికారంలో లేనప్పటికీ, ఇప్పటికీ ఆయన హవానే నడుస్తోందన్న ప్రచారం ఉంది. భార్య పనిచేస్తున్న జిల్లాకు బదిలీ చేయించుకునే రెడ్డిగారి ప్రయత్నాలకు.. ‘బావగారి’ భరోసా ఉందన్న ప్రచారం జరుగుతోంది.

ఇక కర్నూలు డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా జగన్ జమానాలో నియమితులైన నారాయణ రెడ్డి, ఇప్పటికీ అదే శాఖలో కొనసాగుతుండటం విశేషం. బదిలీల సమయంలో మిగిలిన అధికారులంతా బదిలీ అవుతున్నప్పటికీ, వీరిని మాత్రం తరచూ మినహాయిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ప్రభుత్వం మారినా వీరంతా ఇంకా అక్కడే కొనసాగుతున్నారంటే.. వీరికి పైస్థాయిలో ఎంత పలుకుబడి ఉందో స్పష్టమవుతోందని కార్మిక శాఖ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రధానంగా ‘బావగారి’ అండదండలు ఏ స్థాయిలో ఉన్నారోఅర్థమవుతోందంటున్నారు. ఫ్యాక్టరీస్ విభాగంలో మహా‘రాజు’లా చక్రం తిప్పుతున్న ఓ అధికారి దన్ను పుష్కలంగా ఉండటమే దానికి కారణమంటున్నారు. త్వరలో రిటైరవుతున్న సదరు అధికారి, ముందస్తుగా ఒక పెద్ద ఫార్మా కంపెనీలో సేఫ్టీ అధికారిగా ఉద్యోగం సంపాదించేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

అటు లేబర్ డిపార్టుమెంటులో కూడా జరుగుతున్న అడ్డగోలు బదిలీలకు అంతులేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సహజంగా ఏ అధికారిని వారి సొంత జిల్లాల్లో నియమించరు. కానీ ఘనత వహించిన కార్మికశాఖలో మాత్రం ఆ నిబంధనను కొండెక్కించేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నియామకాలలో సొంత జిల్లా నిబంధనను, అతిక్రమించారని కార్మికశాఖ వర్గాలు చెబుతున్నాయి.

విజయనగరం జిల్లాకు చెందిన ఓ అధికారికి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలుబీ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అధికారిని అదే జిల్లాలోబీ కర్నూలు జిల్లాకు చెందిన ఓ అధికారికి అక్కడి మూడు జిల్లాల బాధ్యతలు అప్పగించారట.

అయితే దీనిని కొందరు ప్రశ్నించిన సందర్భంలో.. వారికి పోస్టింగులు ఇచ్చేందుకు ఎక్కడా ఖాళీలు లేవన్న సమాధానం, ఉన్నతాధికారుల నుంచి వచ్చిందట. నిజానికి వారి స్థాయి అధికారులను బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వెల్ఫేర్ బోర్డు (బీఓసీడబ్ల్యు)కు సీఈఓలుగా నియమించే అవకాశం ఉందని కార్మిక శాఖ అధికారి ఒకరు వివరించారు. అయితే అది లాభసాటి పోస్టు కాదనే ప్రచారం ఉందట.

ఇక బాయిలర్ విభాగంలో పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారిపై, గత ఏడాదిలో ఏసీబీ దాడి జరిగింది. అయినప్పటికీ మళ్లీ అదే స్థానంలో నియమించారంటే .. బావగారి హవా, కార్మిక శాఖలో ఏ స్థాయిలో నడుస్తుందో అర్థమవుతోందని కార్మికశాఖ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

# ఆదర్శ నియోజక వర్గంగా ‘కుప్పం’

(మొదటిపేజీ తరువాయి..)

వంటి 10 అంశాలకు విజన్ డాక్యుమెంటులో ప్రాధాన్యత ఇచ్చాం’ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పం రెండోరోజు పర్యటనలో మదర్ డెయిరీ, కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడారు.

### కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.92 కోట్లు

2047 నాటికి దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం తయారుకావాలి. మరో మూడు నెలల్లో కుప్పానికి వస్తాను. కడా ఆధ్వర్యంలో కుప్పంలో చేపట్టే అభివృద్ధి పనులను నేను స్వయంగా పర్యవేక్షిస్తాను. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 92.22 కోట్లు మంజూరు చేశాం. అందులో రూ. 22 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెస్ నిర్మాణం పూర్తి చేస్తాం. గత ఐదేళ్లు ఈ ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. రూ.20 కోట్ల వ్యయంతో కుప్పంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. రూ.10 కోట్ల వ్యయంతో కుప్పంలో 10 జంక్షన్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారులను సుందరీకరిస్తాం.

విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేశాం. రూ.19 కోట్ల వ్యయంతో పార్కులను అభివృద్ధి చేయబోతున్నాం. కుప్పం నియజకవర్గంలో గుంతల రోడ్లు కనపడకూడదు. రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ. 34.27 కోట్లు మంజూరు చేశాం. శాంతిపురం పరిధిలో మదర్ డెయిరీకి 41 ఎకరాల 21 సెంట్లు ఇచ్చాం. రూ. 105 కోట్ల వ్యయంతో రాబోతున్న ఈ డెయిరీ వల్ల నాలుగు వేలమందికి ఉద్యోగాలు వస్తాయి. అలాగే శ్రీజ మహిళా మిల్క్ సంస్థ ఏర్పాటుతో మరో నాలుగు వేల ఉద్యోగాలు రాబోతున్నాయి. కుప్పం పరిధిలో రూ.22 కోట్ల వ్యయంతో ఆలయాల అభివృద్ధికి



నిధులు మంజూరు చేశాం. డ్వాక్రా ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశాను. ఇప్పుడు కుప్పం నియోజకవర్గంలో అలీప్ సంస్థ సహకారంతో మహిళలకు పలు ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తారు.

### టాటా సహకారంతో మెరుగైన వైద్య సేవలు

కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేస్తున్న కడా అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కుప్పాన్ని టూరిజం హబ్ గా మారుస్తా. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందులో భాగంగా గన్నవరం ఎయిర్ పోర్టును కూచిపూడి నృత్యం థీమ్‌తో ఆధునీకరిస్తున్నాం. కుప్పం ప్రజలు కాలుష్యానికి దూరంగా ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాను. ప్రతి ఇంటిపై సోలార్ వెలుగులు రాబోతున్నాయి. కుప్పంలో కార్గో ఎయిర్ పోర్టు రాబోతోంది. ఇక్కడి ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తీసుకొస్తున్నాం. టాటా సంస్థ సహకారంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తాం’ అని సీఎం చంద్రబాబు అన్నారు.






జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 07, జనవరి 2025




జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 07, జనవరి 2025


## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారథ్యంలో





బోడపూడి సుబ్బారావు (BSR)

సారధ్యంలో



03

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 08, జనవరి 2025

# అయితే.. కమ్మోరిని బహిష్కరించండిక!


తన నియోజకవర్గంలో కమ్మ ప్రాధాన్యం తగ్గిస్తానంటూ తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు.. పౌరుషం ఉన్న ఏ కమ్మవారినయినా కదిలించేవే. ఇదే మాట మరో సామాజిక వర్గం మీద అనుంటే, పరిస్థితి ఎలా ఉండేదో ఆంధ్రప్రదేశ్ లో అందరికీ తెలుసు.

కమ్మరావతి అన్నా.. కమ్మరోనా అన్నా..కిక్కురుమనలేదు కమ్మవారు. ఎన్టీఆర్‌ని అయినా, చంద్రబాబును అయినా గుండెల్లో పెట్టుకుని అభిమానించారు. తేడాలొస్తే నిర్మొహమాటంగా నేలకేసి కొట్టినంత పని చేశారు.

తమ వ్యతిరేకతను పైకి ఏమాత్రం కనపడనివ్వరు. టైం వచ్చినప్పుడు చేతల్లో మాత్రమే చూపిస్తారు. వీళ్ళ ప్రోగ్రెసివ్ మెంటాలిటినే... వీళ్లకు శాపంలా మారింది.. అందరి అసూయకు కారణమైంది. అధిక శాతం మంది బీసీ సోదరులు కమ్మలను అభిమానించినంతగా.. మిగతా సామాజికవర్గాల వారు అభిమానించరు ఇది వాస్తవం.

ఇలాంటి చర్యల ద్వారా... బీసీల్లో కుడా వ్యతిరేకత కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని భావించాలి. 2024 ఎలక్షన్స్‌లో పోలరైజ్ అయిన కమ్మ ఓట్లు... ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్స్ చరిత్రలోనే ఎప్పుడూ అయ్యుండవు.

అయినా... ఒకపక్క కమ్మ అధికారుల్ని, మరోపక్క కమ్మ




నాయకుల్ని నిర్దాక్షిణ్యంగా పక్కన పెడుతున్నారు బాబుగారు! బాబు గారు ఇంకా మొహమాట పడుతున్నారని భావిస్తే... బహిష్కరించడం ఒక్కటే మిగిలింది రాష్ట్రం నుంచి !!

**- కంకణాల శ్రీనివాస్**

# 'బుక్స్' బరువొద్దు!

(మొదటిపేజీ తరువాయి..)

సమూల ప్రక్షాళనపై పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య శాఖాధికారులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో నాలుగు గంటలకుపై సుదీర్ఘంగా సమీక్షించారు.

ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా సంస్కరణలు చేపట్టాలని అన్నారు. యూనివర్సిటీల్లో క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ లక్ష్యంగా క్రెడిట్ ఫ్రేమ్ వర్క్, ఇంటర్న్ షిప్ లు ఉండాలని చెప్పారు. యూనివర్సిటీల విసిల నియామకంలో అకడమిక్ ఎచీవ్ మెంట్స్, కరిక్యులమ్ డెవలప్ మెంట్, ఫైనాన్షియల్ ప్లానింగ్, ఇంటర్నేషనల్ కొలాబరేషన్ స్ట్రాటజీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నేతృత్వంలో ఏర్పాటయ్యే అడ్వయిజరీ కౌన్సిల్ సభ్యుల ఎంపికలో విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, స్టేక్ హోల్డర్లు, పాలసీ ఎక్స్‌పర్ట్స్, రీసెర్చి నిపుణులకు స్థానం కల్పించాలన్నారు.

వీసీలు, అడ్వయిజరీ కౌన్సిల్ నియామకాలను మార్చి నాటికి పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కరిక్యులమ్ రీస్ట్రక్చర్ సమయంలో సమర్థ్ ప్లాట్ ఫాం సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వర్సిటీల్లో హాస్టళ్ల పనితీరును మెరుగుపర్చేందుకు వెబ్ బేస్డ్ మెనూ, సజెషన్ బాక్సులను ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఎఐ యూనివర్సిటీ, ఇన్నోవేషన్ యూనివర్సిటీ, ఐఐయుఎల్ ఇఆర్‌ల ఏర్పాటుపై చర్చ జరిగింది. యూనివర్సిటీల్లో ప్రస్తుతం 36 శాతంగా ఉన్న గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియను 50 శాతానికి పెంచేలా చర్యలు చేపట్టాలని, చెలెనింగ్ స్కాలర్ షిప్ లకోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులను ఎంపికచేయాలని అన్నారు.

ఇంటర్మీడియట్‌లో అకడమిక్ రోడ్ మ్యాప్, రివైజ్డ్ సిలబస్ – టెక్ట్స్ బుక్స్, అకడమి క్యాలండర్ రూపకల్పన న్యూ సబ్జెక్ట్ కాంబినేషన్, మార్కింగ్ ప్యాట్రన్‌పై మంత్రి లోకేష్ సమీక్షించారు. ఇంటర్మీడియట్ విద్యలో గత పదేళ్లుగా ఎటువంటి సంస్కరణలు చేపట్టలేద న్నారు. మ్యాథ్యలో ఒకే పేపర్, బాటనీ, జువాలజీలు కలిపి ఒకేపేపర్ ఉండేలా మార్పులు చేయడంపై చర్చ సాగింది. అదేవిధంగా సీబీఎస్ఇలో మాదిరి ఇంటర్నల్ మార్కుల విధానం అమలుపై చర్చించారు. అదేవిధంగా ప్రిఫైనల్ ఎగ్జామ్స్‌ను జనవరికల్లా పూర్తిచేసేలా క్యాలండర్ రూపొందిం చాలన్నారు. సంస్కరణలు తెచ్చేటప్పుడు రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి విద్యారంగ నిపుణులు, ప్రజా ప్రతినిధులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

స్కూలు ఎడ్యుకేషన్‌లో ఇప్పటివరకు అమలుచేస్తున్న ఒఎంఆర్ షీట్స్ ద్వారా కాకుండా డిజిటల్ ఎసెస్ మెంట్ విధానం అమలుకు అవకాశాలపై మంత్రి లోకేష్ సమీక్షించారు. దీనివల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడమేగాక ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిఓ నెం. 117కు ప్రత్యామ్నాయం విషయంలో ఎమ్మెల్యేలు, స్కూలు మేనేజ్ మెంట్ కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్లేస్కూలు పాలసీపై కూడా సమావేశంలో చర్చసాగింది.

పాఠ్యాంశాల్లో నైతికవిలువల అంశాలను ప్రవేశపెట్టడంతోపాటు సెమిస్టర్ వైజ్‌గా వేర్వేరు టెక్ట్స్ బుక్స్ కాకుండా ఒకే పుస్తకాలు రెండుసెమిస్టర్ల పాఠ్యాంశాలు ఉండేలా రూపొందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. దీనివల్ల పాఠశాల విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించవచ్చని సూచించారు. ఎటువంటి విమర్శలకు తావీయకుండా పారదర్శకంగా డిఎస్సీని నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో విధివిధానాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర పాఠశాల, ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్, కాలేజి ఎడ్యుకేషన్ డైరక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ కృతికా శుక్లా, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఉన్నత విద్యామండలి చైర్మన్ కొత్త మధుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఏబీవీ ఆత్మీయ సమ్మేళనం

**హైదరాబాద్:** జగన్ జమానాకు తలవంచని వీరుడిగా.. పోస్టింగ్ కోసం పాలకులను దేబిరించకుండా, నిటారుగా నిలబడి, కలబడి, రిటైర్మెంట్ చివరిరోజు వరకూ జగన్ సర్కారుతో పోరాడిన యోద్ధ.. కనీసం ఒక్కసారి కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖం చూడని ఏకైక ఐపిఎస్ అధికారిగా చరిత్ర సృష్టించిన, మాజీ ఐపిఎస్ అధికారి ఏబీ






వెంకటేశ్వరరావు హైదరాబాద్ యూసఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళం.. ఆయన బ్యాచ్‌మేట్స్, ఆయన దగ్గర పనిచేసిన అధికారులు, మిత్రులు, శ్రేయోభిలాషుల నడుమ ఆహ్లాద కరం.. ఉల్లాసం.. ఉత్సాహంగా జరిగింది.

ప్రస్తుతం వివిధ హోదాలో పనిచేస్తున్న ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు, ఏబీ వెంకటేశ్వరరావుతో కలసి పనిచేసిన ఆయన సహచరులు, జర్నలిస్టులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీతో పనిచేసిన అనుభవాలను కొందరు అధికారులు, ఆత్మీయ సమ్మేళంలో పాల్గొన్నారు.

అటు ఏబీ కూడా.. తన సర్వీసు ప్రారంభమైన పోలీసు స్టేషన్‌లో పనిచేసిన నాటి నుంచి .. డీజీ వరకూ తనకు ఎదురైన అనుభవాలను మిత్రులతో పంచుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు ఏబీని అభినందలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఏబీ జీవితంలో జరిగిన సంఘటనలకు సంబంధించి రూపొందించిన డాక్యుమెంటరీ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

## రెన్యువబుల్ ఎనర్జీలో నైపుణ్యాభివృద్ధికి
# సుజ్లాన్‌తో భాగస్వామ్యం!

(మొదటిపేజీ తరువాయి..)

ప్రాంతాల్లో శిక్షణార్థులకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ విండ్ ఎనర్జీ రంగంలో ఎపి యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు పొందేందుకు సుజ్లాన్‌తో చేసుకున్న ఒప్పందం దోహదపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సుజలాన్ గ్రూప్ సీఈవో జేపీ చలసాని, సీ హెచ్‌ఆర్‌వో రాజేంద్ర మెహతా, టాలెంట్ మేనేజ్మెంట్ లీడ్ కమిలిని సన్యాల్, పాఠశాల విద్య, స్కిల్ డెవెలప్మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

ఒప్పందంలో భాగంగా మూడు నుంచి 12 నెలల షార్ట్–టర్మ్, 12 నెలలకు పైగా లాంగ్–టెర్మ్ శిక్షణ ఇస్తారు. విండ్ ఎనర్జీ రంగ అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ కాలేజీల్లో వృత్తి కోర్సులు, ఎలెక్టివ్ ప్రోగ్రాములు నిర్వహిస్తారు. ఎంపిక చేసిన ఐటీఐ పాలిటెక్నిక్ కాలేజీల్లో స్కిల్ ల్యాబ్‌ల ఏర్పాటు చేస్తారు. విండ్ ఎనర్జీ టెక్నాలజీలలో అధునాతన పరిశోధన, ఆవిష్కరణ, అనుభవజ్ఞాన శిక్షణ కోసం ఎక్సలెన్స్ సెంటర్లు స్థాపిస్తారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉపాధికి తోడ్పడే గ్లోబల్ సర్టిఫికేట్లు ప్రవేశపెడతారు. శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనా ల్యాబ్‌లలో ఆధునిక టెక్నాలజీలను అమలుచేస్తారు. సుజ్లాన్ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్‌ను విండ్ ఎనర్జీ నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది, గ్లోబల్ స్థాయిలో ప్రతిభావంతులను తయారు చేసి, భారతదేశ క్లీన్ ఎనర్జీ రంగ ఆవిష్కరణలలో ఎపిని ముందు వరుసలో నిలబెడుతుంది.

సుజ్లాన్ ఎనర్జీ స్కిల్ డెవలప్‌మెంట్ ఎండ్–టు–ఎండ్ డెవలంమెంటల్, ఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను సమీకృతం చేసి విండ్ ఎనర్జీ సెగ్మెంట్‌లో నైపుణ్యం, సామర్థ్యాలను మెరుగుపరస్తుంది. స్కిల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఏపీలోని ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల నుండి తగిన మౌలిక సదుపాయాలకు సుజ్లాన్ సహకారాన్ని అందిస్తుంది. పరికరాలను సేకరించడం, ఇన్‌స్టాల్ చేయడం, పరిశ్రమకు సమకాలీనమైన పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడం, ధృవీకరించబడిన శిక్షకులను సమీకరించడం. శిక్షకుల కోసం సామర్థ్య–నిర్మాణాన్ని అమలు చేయడం వంటి కార్యక్రమాలను సుజ్లాన్ చేపడుతుంది. పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా వరల్డ్ క్లాస్ సర్టిఫికేషన్ అందజేస్తుంది. పవన విద్యుత్ రంగంలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులకు మార్గం సుగమం చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్–ఎస్‌డీసీ) సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్‌కు సహకారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ఏపీలోని విండ్ పాకెట్ జిల్లాలు, చుట్టుపక్కల ఉన్న ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల నుండి సరైన ఇన్‌స్టిట్యూట్‌లను గుర్తించి స్కిల్‌ల్యాబ్‌ల ఏర్పాటును సులభతరం చేస్తుంది. అవసరమైన కోర్సు కంటెంట్, ఇతర సంబంధిత అనుమతులపై రాష్ట్ర, కేంద్ర అధికారుల నుండి అవసరమైన అనుమతుల కోసం సహకారం అందిస్తుంది. జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాల కోసం విద్యార్థుల సమీకరణలో ఏపీఎస్ఎస్‌డీసీ సుజ్లాన్‌కు మద్దతు ఇస్తుంది. ప్రతిపాదిత సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి పర్యావరణ వ్యవస్థలను ప్రోత్సహిస్తుంది, అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలను అందించడానికి విద్యార్థులను స్థానిక పరిశ్రమలతో అనుసంధానిస్తుంది.

# మార్చి నెలాఖరుకు మెట్రోల డీపీఆర్లు పూర్తి చేయాలి

- **శామీర్ పేట్-మేడ్చల్ మెట్రోల ప్రారంభంలో భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలి...**
- **హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం...**
- **మెట్రో... ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్‌లు) మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు.

హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం–ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్–శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్–మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని... అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల వారు ప్రతి పనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు.

జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలని సీఎం ఆదేశించారు... హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను ఎంపీ చేసింది జనసంఘ్!

- **తొలి లోక్‌సభ ఎన్నికల్లో అంబేద్కర్‌ను ఓడించింది నెహ్రు**
- **పశ్చిమ బెంగాల్ నుంచి అంబేద్కర్‌ను రాజ్యసభకు పంపించిన జనసంఘ్**
- **మరి అంబేద్కర్ ఎవరి మనిషి?**
- **అంబేద్కర్‌ను ఓడించిన కాంగ్రెస్ మనిషా? ఎంపీని చేసిన జనసంఘ్ మనిషా?**
- **నాటి జనసంఘ్.. నేటి బీజేపీకి మరి అంబేద్కర్‌పైద్వేషం ఎందుకు ఉంటుంది?**
- **ఈ చరిత్ర ఎందరికి తెలుసు?**


కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ ఆందోళన నిర్వహించింది. నిజానికి అంబేద్కర్‌ను అసలు పార్లమెంటులో అడుగుపెట్టకుండా అడ్డుకుని ఓడించింది ఎవరు? ఆయనను పట్టుదలతో అదే పార్లమెంటులోకి తీసుకువచ్చింది ఎవరు? నెహ్రూకు అంబేద్కర్‌పై కోపం ఎందుకు? అదే అంబేద్కర్‌ను ఇప్పటి బీజేపీ–అప్పటి జనసంఘ్ పట్టుపట్టి రాజ్యసభకు ఎందుకు పంపించింది? అన్న వాస్తవాలు, గత చరిత్ర తెలుసుకుంటే.. దేశంలో కోట్లాదిమంది అమాయక దళితులు, కాంగ్రెస్ వైపు కన్నెత్తి చూడరు! సరికదా.. అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్‌ను ఛీ కొడతారు. తమను దశాబ్దాల నుంచి కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా మార్చిన తమ నేతలను.. "మాకు చరిత్ర చెప్పకుండా మమ్మల్ని ఎందుకు మోసం చేశార"ని నిలదీస్తారు.

బిజెపి జనతాపార్టీలో కలవకముందు జనసంఘ్‌గా ఉండేది. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ. శ్యామాప్రసాద్,డాక్టర్ అంబేద్కర్లు నెహ్రూ మంత్రి వర్గంలో సహచరులు. వీరిద్దరూ మంచి మిత్రులు.

ఇద్దరూ నెహ్రూవిధానాలతో విభేదించారు. ఇద్దరూ పదవిని తృణప్రాయంగా వదిలేశారు. కశ్మీర్ మీద నెహ్రూ నిర్ణయాలను శ్యామా ప్రసాద్ తో పాటు అంబేద్కర్ కూడా వ్యతిరేకించారు. శ్యామాప్రసాద్, అంబేద్కర్ ఇద్దరూ విద్యాధికులు, మేధావులు.వారు ఈదేశానికి కాంగ్రెస్ పాలన మేలుచేయదని ప్రకటించారు

ప్రథమ లోక్ సభ ఎలక్షన్స్‌లో నెహ్రూ తన పనిమనిషిని పెట్టి..అంబేద్కర్ గారిని ఓడించిన తర్వాత. . జనసంఘ్ పార్టీ అంబేద్కర్ గారిని పశ్చిమబెంగాల్ నుంచి రాజ్యసభకు పంపినది. ఆనాటి అంబేద్కర్ ఆశయాలను జనసంఘ్ నేత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ "అంత్యోదయ" అనే సిద్ధాంతంగా మలచారు. మోదీజీ ఇప్పుడు ఆవిధానాన్నే అమలుచేస్తున్నారు

ఒక ప్రభుత్వపథకం ఏదైనాఉంటే అదిఢిల్లీలో ఉన్నవాడికీ, అండమాన్స్ అడవుల్లో ఉన్నవాడికీ ఒకేరోజు అందాలనేది సూక్ష్మంగా అంత్యోదయలో ఒకనిర్ణయం. అంబేద్కర్‌కి బిజెపికి సంబంధంఏమిటని వ్యాఖ్యానించే వాళ్లు ముఖ్యమంత్రులుగా



ఉండటం మనదౌర్భాగ్యం.

మరి ఇన్ని నిజాలు తెలుసుకున్న తర్వాత కూడా.. బీజేపీ అంబేద్కర్ వ్యతిరేకి ఎలా అవుతుందన్న ప్రశ్న, మెడపై తల ఉన్న ఎవరికయినా వచ్చి తీరుతుంది. అంటే.. చరిత్ర చెప్పడంలో బీజేపీ విఫలయిందా? ఆ కారణంతోనే అంబేద్కర్ ఆరాధకులైన దళితులు కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా మారారా? మరి బీజేపీ అనుబంధ దళితమోర్చా ఏం చేస్తున్నట్లు? .. ఇలాంటి సందేహాలు తెరపైకి రావడం సహజం.

**- జానకీదేవి, తణుకు**

4

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 08, జనవరి 2025




















# వచ్చేశాడు.. 'జన' నాయకుడు!

- **ఫిర్యాదుల కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**కుప్పం, మహానాడు:** స్థానిక తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కార్యాలయంలో 'జన నాయకుడు' కేంద్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని వినతి పత్రాలు సమర్పించేందుకు వీలుగా ఈ 'జన నాయకుడు' ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సమస్యలు, ఫిర్యాదులను 'జన నాయకుడు' పోర్టల్‌లో రిజిస్టర్ చేసేలా వెబ్‌సైట్‌ను కూడా రూపొందించారు. ప్రజల ఫిర్యాదులను తీసుకుని, ఏ విధంగా ఆన్‌లైన్ చేసి ట్రాక్ చేస్తారనే విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు అందుకుని సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.











జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 08, జనవరి 2025





## పేదలకు ఇళ్ళ పేరిట దేవస్థానం ఆస్తులు

# రూ. 3.50 కోట్లు దోపిడి!

- భూ సమస్యలు, సాగునీటి సమస్యలపై పలువురు వినతి
- అర్జీలు స్వీకరించిన మంత్రి నిమ్మల, స్వచ్ఛాంధ్ర పట్టాభిరామ్

**మంగళగిరి, మహానాడు:** వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పేరుతో తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో దేవస్థానం భూము లను నిబంధనలకు విరుద్ధంగా తీసుకొని దేవస్థానానికి చెందాల్సిన రూ.3.50 కోట్లు కొట్టేశారని బీజేపీ నేత వై.కామేశ్వరరావు తెలుగు దేశం పార్టీ(టీడీపీ) గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీనివెనుక ఉన్న దోపిడీదారులు, వారికి కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని దేవాలయాల భూములను కాపాడాలని ఆయన కోరారు. కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.





- ప్రకాశం జిల్లా, సీపీపల్లె మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన వేమూరి సుబ్బారావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని చెరువు ఆనకట్ట, తూములు పూర్తిగా పాడైయ్యాయని అంతే కాకుండా ప్రధాన కాలువ పూడిపోవడంతో చెరువులోకిరావాల్సిన నీరు రావడంలేదని దయ చేసి ఇరిగేషన్ అధికారులు తమ చెరువుపై దృష్టి పెట్టి బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలానికి చెందిన డి. సూర్య ప్రకాశ్ విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని దయ చేసి తన భూ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.
- తన తల్లికి 92 ఏళ్ళని గత ప్రభుత్వంలో కరెంట్ బిల్ ఎక్కువ వచ్చిందని పింఛన్ ను కట్ చేశారని.. దయ చేసి తన తల్లికి పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని విజయవాడ పాయకాపురానికి చెందిన ఎన్. సుబ్బలక్ష్మి విజ్ఞప్తి చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో తాము సీఎల్ఆర్‌పిలుగా పనిచేస్తూ.. తమ ఉద్యోగాలు రెన్యువల్ కోసం ఇటీవల టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీ





పెట్టుకోగా తమ సమస్య పరిష్కరించారని, పెట్టిన అర్జీకి స్పందించిన తమకు మేలు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అర్జీదారు పద్మతో పాటు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వెంటనే స్పందించి తమ పనిని వేగంగా పూర్తి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

- నెల్లూరు జిల్లా, వరికుంటపాడు మండలం రామాపురం గ్రామానికి చెందిన గొడుగులూరి మాలకొండ రాముడు విజ్ఞప్తి చేస్తూ.. మండలంలోని మెట్ట ప్రాంతప్రజలకు సాగు, మంచినీటికి ఆధారంగా ఉన్న నక్కల గండి రిజ ర్వాయర్‌కు నీరు వచ్చేలా కాలువ పూడిక తీత, లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడికి విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌ఎచ్‌ఎంలో నాలుగో తరగతి ఉద్యోగులుగా వివిధ రకాల క్యాడర్లలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని.. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత సీఎం మోసం చేశారని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.
- కృష్ణా జిల్లా, కానూరుకు చెందిన బల్దా చెన్నకేశవరావు విజ్ఞప్తి చేస్తూ.. తిరువూరుమండలం లక్ష్మీపురం గ్రామంలో తన తాత తన తల్లికి రాసి ఇచ్చిన భూమిని అక్రమంగా తన పిన్నికూతరు, తన మేనమామ కొట్టేయాలని చూస్తున్నారని.. దీనిపై కోర్టులో తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అధికారులు తనకు సహకరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# విశాఖ, తిరుపతిలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి:** త్వరలోనే విశాఖపట్నం, తిరుపతిలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ అధికారులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వెలగపూడి సచివాలయం రెండో బ్లాక్‌లోని తన ఛాంబర్‌లో మంత్రి పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల్లో పనుల ప్రగతిపై సమీక్షించారు. 2024 డిసెంబర్ లో విజయవాడ వివంత హోటల్‌లో నిర్వహించిన ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో వచ్చిన ప్రతిపాదనలపై అధికారులతో మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు.

పర్యాటక రంగ అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మెండుగా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహించారని, ఈ క్రమంలో త్వరితగతిన పనులు పూర్తి చేసి తమ శాఖ సమర్థతను నిరూపించుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. త్వరలోనే పర్యాటక ప్రాంతాల్లో పర్యటనలు నిర్వహిస్తానని, పర్యాటకాభివృద్ధి పనుల తీరును స్వయంగా పర్యవేక్షిస్తానని, ఈ నేపథ్యంలో పనులపై మరింత దృష్టిసారించాలని అధికారులకు మంత్రి కోరారు.

పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ఒబెరాయ్, మేఫేర్, తాజ్ గ్రూప్, హయత్, మహేంద్ర, స్టెర్లింగ్ తదితర సంస్థల ప్రతిపాదనలపై మంత్రి దుర్గేష్ చర్చించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ప్రతిపాదనలు పరిశీలించారు. కొత్త టూరిజం పాలసీలో భాగంగా వారికి కల్పించాల్సిన రాయితీలపై చర్చించారు. త్వరలోనే వారందరితో మరోసారి భేటీ అయి ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు మంత్రి ఆసక్తి కనబరిచారు.

రాష్ట్రంలో ఎనిమిది బీచ్‌లను తొలుత అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బీచ్ ల్లో సుందరీకరణ, పరిశుభ్రత, మంచినీటి సరఫరా, బాత్ రూమ్‌ల ఏర్పాటు తదితర మౌలిక వసతుల అంశంపై చర్చరాగా స్వచ్ఛ భారత్‌లో భాగంగా బీచ్ ప్రాంతాల్లో క్లీనింగ్ చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. స్థానికంగా ఉండే పెద్ద పారిశ్రామిక సంస్థలతో చర్చించి ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కోరాలని అధికారులకు తెలిపారు.



ఈ నెలాఖరు నాటికి ఆధునికీకరణ పూర్తి చేసుకుంటున్న టూరిజం హోటళ్లను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

తమ తమ నియోజకవర్గాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాల వివరాలను శాసన సభ్యుడు తీసుకొస్తే అధికారులు వాటిని పరిగణలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విశేష ప్రాచుర్యం కల్పించే విషయంలో సినిమా రంగంలోని సెలబ్రెటీల సహాయ సహకారాలను తీసుకోవాల్సిన అంశాన్ని మంత్రి ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కి నిధులతో చేపట్టే అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టుల అమలు తీరుపై అధికారులకు మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం చేశారు.

### సినిమాటోగ్రఫీ శాఖపై విస్తృతంగా చర్చ

మంత్రి కందుల దుర్గేష్‌తో హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ భేటీ అయి సినిమాటోగ్రఫీ శాఖపై విస్తృతంగా చర్చించారు. నూతన ఫిల్మ్ పాలసీ అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి కుమార్ విశ్వజీత్ ఇటీవల అదనపు డీజీపీ నుండి డీజీపీ ర్యాంక్ పదోన్నతి పొందిన సందర్భంగా మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.

సమావేశంలో టూరిజం శాఖ సెక్రటరీ వినయ్ చంద్, టూరిజం ఎండీ ఆమ్రపాలి, టూరిజం శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లు పద్మావతి, శేషగిరి, చీఫ్ ఇంజినీర్ నర్సింహారావు, సూపరెంటెండెంట్ ఇంజినీర్ ఈశ్వరయ్య, కన్సల్టెంట్ సత్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

## ఏ ఒక్క గుండె ఆగకూడదు..

# ఏ కుటుంబం బాధపడకూడదు

- ఆరోగ్యమే మహాభాగ్యం పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం
- రక్తహీనత లేని రామచంద్రపురం సాధనే లక్ష్యం
- హార్ట్ స్ట్రోక్, క్యాన్సర్ మరణాలు తగ్గించడమే లక్ష్యం
- డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు కృషి
- వచ్చే మార్చిలోగా కార్యాచరణ అమలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

**రామచంద్రపురం, మహానాడు:**
రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలు ఆరోగ్యవంతులై, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలనే మహోన్నత లక్ష్యంతో 'ఆరోగ్యమే మహాభాగ్యం పైలట్ ప్రాజెక్టు' కు కార్మిక శాఖ మంత్రి సుభాష్ శ్రీకారం చుట్టారు. ఆ వివరాలను మంగళవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో హెల్దీ హార్ట్ మిషన్ ద్వారా హార్ట్ ఎటాక్ లు నియంత్రించేందుకు కార్యచరణ రూపొందించామని, ఈ బృహత్తర కార్యక్రమానికి, ప్రముఖ వైద్యులు కోట. సతీష్ తో పాటు, సి ఎస్ ఆర్ నిధులను ఇచ్చేందుకు ఒక ప్రైవేటు కంపెనీ సహకారం తీసుకుంటున్నామన్నారు.

ముందుగా నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, ఆరోగ్యం పట్ల వారిలో చైతన్యం, అవగాహన కల్పిస్తామన్నారు. నేటి ఆధునిక జీవనశైలి, మానసిక ఆందోళన,ఒత్తిడి, మద్యం, ధూమపానం తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కువగా పురుషులు హృదయ సంబంధ వ్యాధులతోనూ, మహిళలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని, ఈ వ్యాధులను గుర్తించేందుకు అవసరమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు అతి తక్కువ నామమాత్రపు రుసుంతో నిర్వహిస్తామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వ్యక్తిగత



నిధులను కూడా కేటాయిస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.

రామచంద్రపురంలో రక్తనిధి, అనాథ ఆశ్రయాలు ఏర్పాటుచేసి ఆదుకుంటామన్నారు.

ప్రముఖ వైద్యులు కోట సతీష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గ ప్రజలకు మేలు చేయాలని సదుద్దేశంతో మంత్రి సుభాష్ హెల్దీ హార్ట్ మిషన్ కు ముందుకు రావడం గర్వకారణం అన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, 2డి ఎకో, టిఎంటి, క్రియాటినిన్ వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. తొలుత వ్యాధిపై అవగాహన కలిగి ఉండడం, వ్యాధిని గుర్తించడం, వైద్యం అందేలా చేయడం, అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.


హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి 90 నిమిషాల్లో వైద్యం అందేలా చూస్తేమరణాల రేటును తగ్గించవచ్చునని అన్నారు. నూటికి 20% మందికే ఆధునిక వైద్యం అందుతుందని, మిగిలిన 80 శాతం ప్రజలకు వైద్య సహాయం అందించడమే మా కర్తవ్యం అన్నారు.

## బీజేపీ ఆఫీసుపై దాడికి

# సీఎం రేవంతే బాధ్యత వహించాలి

- పార్టీ ఏపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్

**విజయవాడ, మహానాడు:**



ప్రభుత్వాలు తమ విధి మర్చిపోయి ప్రజలపై దాడులకు పాల్పడుతున్నప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడం తప్ప మార్గం ఉండదు. తెలంగాణలో వ్యవస్థలన్నీ కప్పకూలి పోయాయన్నదానికి భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఆఫీసుపై జరిగిన కాంగ్రెస్ మూకదాడే సాక్ష్యం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. శాంతిభద్రతలు తమ అధీనంలో ఉంటా యని ఓ చిన్న రాయి ఎదుటివారిపై పడిన అది వారి అరాచక వాదమే. అలాంటిది నేరుగా తెలంగాణలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీజేపీ ఆఫీసుపై దాడి చేస్తారా? మూకను ఉసిగొల్పి రాళ్లు చేతికిచ్చి పంపిస్తారా? అని ఆ పార్టీ ఏపీ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీలపై ప్రభుత్వాలే ఇలాంటి మూకదాడులను ప్రోత్సహిస్తే ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉంటుంది? ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య యుత నిరసనలు చేయవచ్చు? అయినా ఢిల్లీ రాజకీయాలకు తెలంగాణకు సంబంధం ఏమిటి ? అక్కడి ఎన్నికల్లో రాజకీయ నేతలు విమర్శలు చేసుకుంటే తెలంగాణ ఆఫీసుపై దాడి చేయడమేంటి? అని ఆయన ప్రశ్నించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి చేతిలోనే హోంమంత్రిత్వ శాఖ కూడా ఉంది. ఆయనే ఈ దాడికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. తక్షణం నిందితుల్ని అరెస్టు చేసి భారతీయ జనతా పార్టీకి భేషరతు క్షమాపణ చెప్పకపోతే ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఆయనే ఈ దాడులకు వ్యూహరచన చేశారని అనుకోవాల్సి వుంటుందని ఆయన హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా తీసుకుంటే అంత కంటే తీవ్రమైన పొరపాటు ఉండదని హెచ్చరిస్తున్నాం. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్ట పరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందే అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తారా? అని విష్ణువర్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గతంలో ఏపీలో ఇలా ప్రతిపక్ష నేతల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసిన పార్టీకి ప్రజలు ఏ గతి పట్టించారో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి గుర్తు చేస్తున్నారు. తక్షణం ఈ ఘటనను ఖండించి.. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ గూండాలపై కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టి వెంటనే జైళ్లకు పంపాలి. లేకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుంది హెచ్చరిస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు.

# పోలీసుల దర్యాప్తులో 'డిజిటల్ అరెస్టు' లేనే లేదు!

- లఘుచిత్రం ఆవిష్కరించిన ఎస్పీ వకుల్ జిందల్

**విజయనగరం, మహానాడు:** డిజిటల్ అరెస్టు పట్ల ప్రజలను జాగృతం చేసి, వారిలో అవగాహన కల్పించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు టూల్స్ వినియోగించి ప్రత్యేకంగా రూపొందించిన లఘు చిత్రంను ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబరు మోసగాళ్ళు కాల్స్, లింక్స్, వీడియో కాల్స్‌తో ప్రజలకు ఉచ్చు వేస్తూ, వారిని భయపెట్టి, వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. సైబరు నేరగాళ్ళు ముందుగా ఫోను చేసి వ్యక్తిగత సమాచారం, చిరునామా, ఆధార్ నంబరు, ఫోను నంబరు వంటి వివరాలను తెలిపి, దూర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులు లేదా పిల్లలు పోలీసు కేసులో ఇరుక్కున్నారని భయభ్రాంతులకు గురి చేస్తారన్నారు.

ఫోన్లో వాట్సాప్, స్కైప్ వంటి యాప్ల ద్వారా వీడియోకాల్స్ చేసి సిబిఐ, కస్టమ్స్ , పోలీసు అధికారిగా నమ్మించి, నకిలీ పత్రాలతో బెదిరించి, జైలు పేరు చెప్పి ప్రజల్ని భయపెట్టి అందినంత సొమ్మును తమ ఖాతాలకు జమ చేసుకుంటారని ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దర్యాప్తులో డిజిటల్ అరెస్టు అన్నదే లేదన్నారు. ఈ తరహా కాల్స్ వస్తే



పోలీసు స్టేషను లేదా 1930కు లేదా https://cybercrime.gov.in ఫిర్యాదు చేయాలన్నారు. డిజిటల్ అరెస్టు పట్ల అవగాహన కల్పించేందుకు షార్టుఫిల్మ్‌ను రూపొందించి, సోషల్ మీడియా ప్లాట్ఫార్మ్ ద్వారా ప్రజలకు చేరువ చేయనున్నామని ఎస్పీ అన్నారు.

షార్టు ఫిల్మ్‌ను రూపొందించుటలో క్రియాశీలకంగా పని చేసిన సోషల్ మీడియా సెల్ కానిస్టేబులు బి.రాంబాబును ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రంను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ ఎ.వి.లీలారావు, కానిస్టేబుల్ బి.రాంబాబు పాల్గొన్నారు.

6
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 08, జనవరి 2025



# జీఎంసీ సంక్రాంతి సంబరాలు

- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కమిషనర్

**గుంటూరు, మహానాడు:** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జీఎంసీ సంక్రాంతి సంబరాలు ఈ నెల 12 నుండి 15 వరకు జరుగుతున్నాయి. మంగళవారం స్టేడియంలో బ్రోచర్ ని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవి, కార్పొరేటర్లు, అధికారులు ఆవిష్కరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నగర ప్రముఖులతో సంబరాల నిర్వహణ కమిటీ ఏర్పాటు అయింది. ఈ సంబరాల్లో తెలుగు సంప్రదాయాలను నేటి తరానికి తెలిపిలేలా ఏర్పాటు చేస్తున్నారు. తంబోలా, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొనే వారు మంగళవారం సాయంత్రం నుండి ఎన్టీఆర్ స్టేడియంలో ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. మీడియా మిత్రులకు క్రికెట్, షటిల్ పోటీలు పెట్టారు. 15వ తేదీన విజేతలు బహుమతులు ప్రదానం చేస్తారు.

# ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కత్తిపీట!

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపణ



**విజయవాడ, మహానాడు:** పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్య శ్రీ. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మానస పుత్రిక ఈ పథకం. ప్రాణాలు తీసే జబ్బొచ్చినా సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని.. కూటమి సర్కార్ అనారోగ్యశ్రీగా మార్చిందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. రూ. మూడు వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా, వైద్యసేవలు నిలిచే దాకా చూడటం అంటే.. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రనే ఇదంతా అని ఆరోపించారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే.. ఆరోగ్య శ్రీ పథకానికి చరమగీతం పాడి.. ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది.

ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కత్తిపీట వేస్తున్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ.. వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పథకానికి బకాయిలు గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టినవి అయినా.. వాటిని చెల్లించే బాధ్యత మీ ప్రభుత్వంపైనే ఉంది. వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవండి. పెండింగ్ బకాయిలు రూ.3వేల కోట్లు తక్షణం విడుదల చేయండి. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏలోటూ రాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం.

# కొడుకు.. తండ్రిని మించిన ముదురు!



అయిన వాళ్లకు ఆకుల్లో... కాని వారికి కంచాల్లో అన్న సామెతను గత వైసీపీ ప్రభుత్వం తూచా తప్పకుండా పాటించింది. అంతేనా... జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి కండబలం చూపి కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్‌లను తన అనుయాయులకు రాయించేసుకుంటే.. జగన్ బినామీలు, భారతి రెడ్డి బినామీలు ఏ రీతిన ఆస్తులను తమ పేరిట రాయించుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక తానేమీ తక్కువ తినలేదన్నట్లుగా వైసీపీ జమానాలో అదనపు అడ్వొకేట్ జనరల్‌గా పనిచేసిన వైసీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి కుటుంబం కూడా తమదైన శైలిలో ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకుని అందిన కాడికి దండుకుంది.

తాజాగా వెలుగు చూసిన ఈ దందాలో సుధాకర్ రెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి తనదైన శైలిలో చక్రం తిప్పి... అటు శ్రీకాకుళం జిల్లాతో పాటుగా ఇటు అన్నమయ్య జిల్లాలోనూ గనులను చేజిక్కించుకున్నారు. ఈ వ్యవహారాల్లో కార్తీక్ రెడ్డికి నాటి గనుల శాఖ డైరెక్టర్ హోదాలో వీజీ వెంకటరెడ్డి ఏ రీతిన సాగిలపడ్డారన్న విషయమూ బయటపడింది.

సుధాకర్ రెడ్డి సాదాసీదా లాయర్‌గా కొనసాగుతున్నంతసేపూ కార్తీక్ రెడ్డి అనాకుడిగానే ఉండిపోయాడు. అయితే, ఎప్పుడైతే వైసీపీ అధికారంలోకి వచ్చి...తన తండ్రికి ఏకంగా అదనపు అడ్వొకేట్ జనరల్ పదవి దక్కిందో... అతడిలోని అసలు సిసలు వ్యక్తి మేల్కొన్నాడని చెప్పాలి. కలర్ గ్రానైట్ క్వారీలను దక్కించుకునేందుకు రంగంలోకి దిగిన కార్తీక్ రెడ్డి...శ్రీకాకుళం జిల్లా నందిగం మండలం సొంటినూరులో 4.9 హెక్టార్లలోని గనుల కోసం టెక్కలి గనుల శాఖ ఏడీకి దరఖాస్తు చేసుకున్నారు.

పొన్నవోలు కుమారుడు కావడంతో టెక్కలి గనుల శాఖ ఏడీ ఆఘమేఘాలపై ఆ దరఖాస్తుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసి తన పై అధికారికి పంపారు. ఆ తర్వా ఆ ఫైల్ ఎక్కడా ఆగలేదట. నేరుగా గనుల శాఖ సంచాలకుడిగా ఉన్న వెంకటరెడ్డి తన వద్దకు రాగానే ఆ దరఖాస్తుకు ఆమోద ముద్ర వేస్తూ... రెండు హెక్టార్లలో కలర్ గ్రానైట్ ను కార్తీక్ రెడ్డికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇంకో ఆసక్తికర విషయం కూడా ఉంది. ఈ గనుల కోసం ఇప్పటికే 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 200 మందికి ఏడీ కార్యాలయం అనుమతులు ఇవ్వొచ్చంటూ తన అభిప్రాయాన్ని కూడా తెలిపింది. అయితే, వారందరి కంటే ఆలస్యంగా వచ్చిన కార్తీక్ రెడ్డికి గనులు కేటాయించిన జగన్ సర్కారు... మిగిలిన వారికి మొండిచేయి చూపించింది.

ఇక అన్నమయ్య జిల్లా మదనపల్లి ఏడీ కార్యాలయం పరిధిలోనూ ఇదే తంతు నడిచింది. బండకిందపల్లిలో రెండు హెక్టార్లలో కలర్ గ్రానైట్ గనులను కేటాయించాలంటూ కార్తిక్ రెడ్డి అలా దరఖాస్తు చేసుకోగానే ఇలా ఆయనకు గనులను కేటాయించారు. ఈ సందర్భంగా అప్పటికే అమలులో ఉన్న ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిని పక్కనపెట్టేసిన అధికారులు... కార్తీక్ కంటేముందు వచ్చిన ఓ మహిళ దరఖాస్తును పక్కనపెట్టేసి మరీ తమ స్వామి భక్తిని చాటుకున్నారు. ఇలా కార్తీక్ రెడ్డికి గనుల కేటాయింపులో నాటి ప్రభుత్వం ఎంతలా కదిలిందంటే... ఏళ్లు పట్టే అనుమతులను రోజుల వ్యవధిలో జారీ చేసి పారేసింది.

ఇలా కార్తీక్ రెడ్డి దరఖాస్తు చేసుకోవడమే ఆలస్యం అన్నట్లుగా అధికార యంత్రాంగం ఆయన దరఖాస్తులను పరుగులు పెట్టించింది. ఈ సందర్భంగా నిబంధనలను అధికారులు తుంగలో తొక్కేశారు. అంతేగా మరి... తమ వారి కోసం నిబంధనలను తుంగలో తొక్కని అధికారులను వైసీపీ నేతలు ఈజీగా వదలరు కదా. వెరసి వైసీపీ జమానాలో చేతివాటం ప్రదర్శించిన చాలా మంది నేతల జాబితాలో ఇప్పుడు పొన్నవోలు కుటుంబం కూడా చేరిపోయిందన్న మాట!

# క్రీడా పోటీలతో ప్రతిభ వెలుగులోకి వస్తుంది

- టీడీపీ యువ నేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్



**దర్శి, మహానాడు:** క్రీడా పోటీలతోనే యువతలోని క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుందని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) యువ నేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ సూచించారు. దర్శి పట్టణం, అద్దంకి రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గొట్టిపాటి–నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లలిత్ సాగర్ హాజరై, ప్రారంభించారు. ఆయన యువతనుద్దేశించి, మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత ఐటీ శాఖ మంత్రి లోకేష్ సారథ్యంలో రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే పట్టణంలో మినీ స్టేడియం పూర్తి చేసేందుకు కృషి జరుగుతున్నట్టు లలిత్ సాగర్ చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు క్రికెట్, కబడ్డీ వంటి పోటీలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ప్రకటించారు.

### బహుమతులకు భారీ విరాళాలు

ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతికి టీడీపీ దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి రూ.1,15,116, రెండో బహుమతికి నారపుశెట్టి పిచ్చయ్య రూ.65 వేలు, మూడో బహుమతికి దారం సుబ్బారావు రూ.45 వేలు, నాలుగో బహుమతికి మార్తుల యలమందా రెడ్డి రూ. 25 విరాళంగా ప్రకటించారు. మాజీ శాసన సభ్యుడు నారపుశెట్టి పాపారావు, దర్శి ఎస్ఐ మురళి, దర్శి మండల ఎమ్మార్వో శ్రవణ్ కుమార్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, శేఖర్ పంతులు వైస్ చైర్మన్ గర్నీపూడి స్టీవెన్, ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

# అయ్యో! నేను బతికే ఉన్నాను..

- రికార్డుల్లో చనిపోయనట్టుగా నమోదు, పింఛను నిలిపివేత
- బీమా సొమ్ము కొట్టేసిన నామినీ
- చీఫ్ విప్ జీవీని కలిసిన బాధితురాలు



**వినుకొండ, మహానాడు:**

పల్నాడు జిల్లా, వినుకొండలో దారుణం వెలుగు చూసింది. నిక్షేపంగా బతికి ఉన్న మహిళను చనిపోయిన ట్టుగా చూపించడం, బీమా డబ్బులు చెల్లించడం, అనంతరం పింఛను నిలిపివేయడం ముక్కున వేలేసుకునేలా చేసింది. తాను జీవించే ఉన్న నెలలుగా పింఛను రాక, అవస్థలు భరించలేక బాధిత మహిళ ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల్ని ఆశ్రయించడంతో వైసీపీ ప్రభు త్వంలో జరిగిన ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

సీతయ్య నగర్, వల్లపు శేషమ్మ 15 ఏళ్లుగా వితంతు పింఛను తీసుకుంటున్నారు. 2023 అక్టోబర్ నుంచి ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. అదే నెలలో బతికున్న శేషమ్మను చనిపోయినట్టుగా రికార్డుల్లో నమోదు అయింది. ప్రమాద బీమా పేరిట నామినీ ఖాతాలో డబ్బులు కూడా జమ చేశారు. తర్వాత నెల నుంచి ఆమె పింఛను ఆగిపోయింది. అప్పట్నుంచి బాధిత మహిళ కన్నీటి పర్యంతం అవుతూ ఎంత మందితో కష్టం చెప్పుకున్నా పట్టించుకున్నవారు లేకపోయారు.

చివరకు ఇటీవలే బాధిత మహిళ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ఆంజనేయుల్ని ఆశ్రయించడంతో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. ఈ దారుణంపై విచారణ జరిపించాలని ఆదేశించారు. శేషమ్మకు న్యాయం చేయాలని, పింఛను పునరుద్ధరించాలని సూచించారు. తనలా మరెవరికీ అన్యాయం జరగకుండా చూడాలని శేషమ్మ వేడుకుంటూ జీవీకి కృతజ్ఞతలు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

- ఐక్యమత్యంతో ముందుకు వెళదాం.
- పార్టీ శ్రేణులకు మంత్రి సుభాష్ దిశా నిర్దేశం



**రామచంద్రపురం, మహానాడు:**


త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ (టీడీపీ) స్థానిక కార్యాలయంలో మంగళవారం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన రామచంద్రపురం పట్టణ కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ సభ్యత్వాలు 55 వేలకు పైగా, పట్టణంలో 11 వేలకు పైగా నమోదు చేసుకుని నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ పని చేస్తోందన్నారు. రామచంద్రపురం పట్టణంలో కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి, పార్టీ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని, కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తిస్తామని, ఎవరూ నిరాశ చెందనవసరం లేదన్నారు.

పార్టీ సభ్యత్వాలు నమోదులోనూ, నీటి సంఘాల ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నిబద్ధత కలిగిన పార్టీలో అందరూ కుటుంబ సభ్యుల వలే కలిసిమెలిసి ఉండాలని కోరారు. త్వరలోనే సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి, పార్టీని గ్రామ గ్రామాన మరింత బలోపేతం చేస్తామన్నారు.

# ప్రకృతి సేద్యం విజయవంతానికి క్షేత్రస్థాయిలో పర్యటన

- 'ఇరవై సూత్రాలు' ఛైర్మన్ లంకా దినకర్



**అమరావతి, మహానాడు:** సచివాలయంలోని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ కార్యాలయంలో 'ప్రకృతి సేద్యంలో ప్రతిబంధకాలను అధిగమించి రైతుకు లాభదాయకత పెంచడానికి చేపట్టాల్సిన చర్యలు'పై మంగళవారం సమావేశం జరిగింది.

కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలపైన వివిధ జిల్లాలో జరిపిన సమీక్షల అనంతరం ప్రకృతి సేద్యంపైన ఉన్న అపోహల నివృత్తి కోసం చేపట్టాల్సిన చర్యలపైన చర్చించారు.

వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రకృతి సేద్యం తో ప్రజలకు ఆరోగ్యం, రైతులకు లాభదాయకత. దేశంలో ఆర్గానిక్ ఫార్మింగ్ వృద్ధి చెందే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ రైతులను ప్రోత్సాహకాలతో ప్రోత్సహిస్తున్నారని లంకా దినకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆర్గానిక్ ఫార్మింగ్ హబ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ చేపట్టారని, దేశీ అవులను ప్రకృతి సేద్యంలో భాగస్వామ్యం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పాలు, పెరుగు, నెయ్యితో పాటు వ్యవసాయానికి అవసరమైన సహజ ఎరువులు ఉత్పత్తి లభ్యం అవుతుందని ఆయన తెలిపారు.

విజయనగరం జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కోరిన విధంగా ముఖ్యమంత్రి అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న నాయుడు సహకారంతో ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఒక బృందాన్ని ఆ జిల్లాలో ప్రకృతి సేద్యాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపైన అధ్యయనం చేసి, కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడానికి నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్తు, అత్తలూరి పాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఎండీ సురేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మురికి కాలువలో పసికందు!



**కోలనుకొండ, మహానాడు:** గుంటూరు జిల్లా, తాడేపల్లిలో అవమానవీయమైన సంఘటన చోటుచేసుకుంది. ఏ కష్టం వచ్చిందో ఏమో ఓ మాతృమూర్తి ముక్కు పచ్చలారని పసికందును మురికి కాలువలో పడేసింది. తాడేపల్లి మండలపరిధిలోని కోలనుకొండలో ఈ దారుణ సంఘటన చోటు చేసుకుంది. పసిగుడ్డు పుట్టి కనీసం గంటల వ్యవధిలోనే ఆ చిన్నారిని పారబోసింది. చిన్నారి వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమై ఉన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 08, జనవరి 2025


# ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

**- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ**



**సత్తెనపల్లి, మహానాడు:** ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దు.. అలాంటివారు తారాసపడితే ఫిర్యాదు చేయండి.. ఎయిర్ పోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని దొంగలు సామాన్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చిందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదలైంది. అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆయన కార్యాలయ ఉద్యోగుల పేర్లతో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు డబ్బులు వసూలు చేసినా తాట తీస్తామని హెచ్చరిస్తున్నాం. ఉద్యోగాలకు డబ్బులు వసూలు చేసే వారి సమాచారాన్ని మాకు తెలియజేయవలసిందిగా కోరుకుంటున్నాం.



## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**జగ్గయ్యపేట, మహానాడు:** పట్టణంలో ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో నూకల రవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా శాసన సభ్యుడు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని, పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, కళ్యాణం కృష్ణారావు, కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి వెంకటరావు, పేరం సైదేశ్వర రావు, షేక్ షాపు, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి 28వ వార్డులో అజ్మీర్ దర్గా ఉరుసు(గంధం) కార్యక్రమంలో పాల్గొని మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ

## తెలంగాణలో ఉన్నది ఆటవిక రాజ్యమా...ప్రజాస్వామ్యమా?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ



**గుంటూరు, మహానాడు:** తెలంగాణలో ఉన్నది ఆటవిక రాజ్యమా.. ప్రజాస్వామ్యమా? భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తెలంగాణ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నామని ఆ పార్టీ ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అధికార పార్టీ కార్యకర్తలు దాడి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసిన ఖండించాల్సిందే. చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారంలో ఉన్నామని దాడి చేస్తే చూస్తూ ఊరుకోం. మేం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో దాడులు చేయగలమని అని ఆయన హెచ్చరించారు.



ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు. స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీలు సి.ఎం రమేష్, భరత్.



# కొన్ని తగ్గించుకుంటేనే మంచిది!



**హైదరాబాద్:** అల్లు అర్జున్.. ఐకాన్‌స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న అల్లు అర్జున్ ప్రస్తుతం 'పుష్ప 2' సినిమాతో ఏకంగా పాన్ ఇండియా స్టార్ అయిపోయారు. అంతేకాదు రూ.1800 కోట్ల క్లబ్ లో చేరి సరికొత్త రికార్డు క్రియేట్ చేశారు.

ముఖ్యంగా ఇప్పటివరకు ఉన్న 'ఆర్ఆర్ఆర్' బాహుబలి 2' రికార్డులను సైతం బ్రేక్ చేశారు. ఇకపోతే ఇక్కడి వరకు అంతా బాగున్నా.. తాజాగా అల్లు అర్జున్. మరొకసారి కాస్త తల పొగరుగా ప్రవర్తించి ప్రభాస్ అభిమానుల ఆగ్రహానికి గురయ్యారు. అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో రష్మిక మందన్న హీరోయిన్ గా వచ్చిన చిత్రం 'పుష్ప 2'. ఇక ఇందులో జగపతి బాబు, ఫహద్ ఫాసిల్, సునీల్, అనసూయ వంటి భారీ తారాగణం భాగమైంది.

దీనికి తోడు జాతర సీక్వెన్స్ ఈ సినిమాకి ప్లస్ గా మారిందని చెప్పవచ్చు. అంతేకాదు ఈ సినిమా ఈ రేంజ్ లో కలెక్షన్లు రాబట్ట డానికి కారణం కూడా ఈ సన్నివేశం అని చాలామంది సినిమా చూసిన ఆడియన్స్ చెబుతున్నారు.

దీంతో ఆనందంతో ఉబ్బితబ్బిబవుతోన్న అల్లు అర్జున్, క్షణికావేశంలో చేస్తున్న పనులు ఇతరులకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. అందులో భాగంగానే ఆయనను మళ్ళీ వివాదంలోకి నెట్టేస్తున్నాయని,చెప్పవచ్చు. ప్రస్తుతం బాహుబలి2 రికార్డులను కూడా బ్రేక్ చేసింది.

### అల్లు అర్జున్‌పై ప్రభాస్ ఫ్యాన్స్ ఫైర్..

అయితే ఈ విషయాన్ని జాతర ఎపిసోడ్ ను పెట్టి, ఒక రీల్ చేశారు అందులో బాహుబలిని ఎగిరి తన్నినట్టుగా ఆ మీమ్ ఉంది. అలాంటి మీమ్ ను అల్లు అర్జున్ ఇప్పుడు లైక్ చేశాడు. దీంతో ప్రభాస్ అభిమానులు అల్లు అర్జున్ పై ఫైర్ అవుతున్నారు. అప్పుడున్న రేట్లు ఏంటి? ఇప్పుడున్న రేట్లు ఏంటి? అయినా ఆ రికార్డును లేపేందుకు మీకు ఎందుకు ఇన్ని సంవత్సరాలు పట్టింది? అంటూ అల్లు అర్జున్‌పై విమర్శలు గుప్పిస్తూ.. ఇలాంటివి కొన్ని తగ్గించుకుంటేనే మంచిది అంటూ ట్రోల్స్ చేస్తున్నారు.

# లక్ష్యాన్ని సాధించిన తర్వాత ఆ అనుభూతే వేరు

**- ఎస్పీ సతీష్ కుమార్**



**గుంటూరు, మహానాడు:** విద్యార్థులు ఏదైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించిన తర్వాత వచ్చే కిక్కు, అనుభూతిని మాటల్లో వర్ణించలేమని గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు-2025' ఘనంగా ముగించారు. చివరి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నప్పుడే భవిష్యత్ గురించి ప్లాన్ చేసుకోవాలన్నారు. జీవితంలో మీకు నచ్చిన రంగాన్నే ఎంచుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

### మన ప్రవర్తనే మనల్ని నిర్ణయిస్తుంది : ఇండియన్ యాక్టర్ సంపూర్ణేష్ బాబు

జీవితంలో మనం ఎదుటివారితో మాట్లాడే మాటతీరు,ప్రవర్తనే మన స్థాయిని నిర్ణయిస్తుందని ఇండియన్ యాక్టర్ సంపూర్ణేష్ బాబు అన్నారు. మనం ఇతరులకు ఇచ్చే సంస్కారమే మనల్ని జీవితంలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందన్నారు. విద్యార్థులందరూ కలలు కని వాటిని సాకారం చేసుకోవాలన్నారు. జీవితంలో దేవుడు మనకు కష్ట సుఖాలతో పాటు అవకాశాలను కూడా ఇస్తారన్నారు. ఆ అవకాశాలను వినియోగించుకున్న ప్రతి ఒక్కరూ జీవితంలో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ.అనురాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు

**టీటీడీ ఈవో శ్యామలరావు**



**తిరుమల, మహానాడు:** జనవరి 10వ తేదీ నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు... 10 వ తేది 4:30 ప్రోటోకాల్, 8 గంటలకు సర్వ దర్శనం ప్రారంభం అవుతుందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు.

10 వ తేది ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వర్ణరథం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి అభయం.. 12 నుంచి 4 గంటల వరకు వాహన మండపంలో శ్రీ మలయప్ప స్వామి దర్శనం.. 11వ తేది ఉదయం స్వామి వారి పుష్కరిణిలో చక్రస్నానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. 94 కౌంటర్ల ద్వార టైం స్లాట్ టోకెన్స్ జారీ చేస్తున్నాం. 9 వ తేది వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశికి సంబంధించి 1 లక్ష 20 వేల టికెట్స్ జారీ . ఇచ్చిన సమయానికి క్యూలైన్ వద్దకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలి. టోకెన్స్, టికెట్స్ ఉన్న భక్తులకే శ్రీవారి దర్శన భాగ్యం. 10 రోజుల పాటు సిఫార్సు లేఖలు, అన్ని రకాల దర్శనాలు రద్దు చేశాం. భారీ స్థాయిలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశాం. టిక్కెట్లపై ఎంట్రీ పాయింట్, పార్కింగ్ పాయింట్స్ సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నాం.

3 వేల మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో గట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నాం.

విద్యుత్, పుష్పాలంకరణతో తిరుమలను సుందరంగా ముస్తాబు చేస్తున్నాం. ప్రయాగ్ రాజ్ లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా. ఈ కార్యక్రమంలో టీటీడీ పాల్గొంటోంది.. హిందూ ధర్మప్రచార పరిషద్ లో భాగంగా నమూనా ఆలయం ఏర్పాటు. 2.5 ఎకరాల భూమిని టీటీడీ కి కేటాయింపు. అక్కడి నమూనా ఆలయం ఏర్పాటు. తిరుమల తరహాలో అన్ని కైంకర్యాలు నిర్వహించే విధంగా చర్యలు. ఉత్తరాది భక్తులకు స్వామి వారి అర్జిత సేవలను తిలకించే భాగ్యం కల్పిస్తాం. కుంభమేళాలో నాలుగు సార్లు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తాం. టోకెన్స్ లేని భక్తులకు దర్శనం ఉండదు. తిరుమలకు అనుమతిస్తాం. 4 లక్షల 32 వేల ఎస్ఎస్డీ టోకెన్స్ జారీ చేస్తున్నాం. హెచ్ఎంపీవీ వైరస్ పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మార్గదర్శకాలు వస్తే అమలు చేస్తాం.



## సంక్రాంతి బస్సుల్లో 10 శాతం రాయితీ

- ఏపీఎస్ ఆర్టీసీ వెల్లడి

**అమరావతి, మహానాడు:** సంక్రాంతి రద్దీ దృష్ట్యా 7,200 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. బుధవారం నుంచి 13వ తేదీ వరకు 3,900 స్పెషల్ బస్సులు, హైదరాబాద్ నుంచి 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375 బస్సులు, తిరుగు ప్రయాణాల కోసం 3,200 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు పేర్కొంది. ఈ బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదని పేర్కొంది. రానూపోనూ టికెట్లు ఒకేసారి బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీగా ఇస్తామని వెల్లడించింది. ఈ నిర్ణయంతో పలువురు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



నియోజకవర్గంలోని పరిధిలోని పలువురు వ్యాధి భాదితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బొండా ఉమ అందచేయడం జరిగింది.



బ్యాట్మెంటన్ విజేత జీవన్‌ను అభినందించిన జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



కుప్పం నియోజకవర్గం, కంగుంది గ్రామంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం తండ్రి శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

## సుప్రీంకోర్టులో కేటీఆర్ పిటిషన్

- ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు
- తెలంగాణ ప్రభుత్వం ముందే కేవియట్ దాఖలు



**హైదరాబాద్:** ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ తరపు న్యాయవాది మోహిత్‌రావు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం ముందే కేవియట్ దాఖలు చేసింది. కేటీఆర్ కనుక సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు కూడా వినాలని ఈ పిటిషన్ లో కోరింది. సాయంత్రం గం.4.40కి సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ జనవరి 8 విచారణకు వచ్చే అవకాశముంది.

08

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 08, జనవరి 2025













# పాలిటెక్నిక్ విద్యార్థుల్లో అద్భుత ప్రతిభ ఉంది

- మంచి ఆలోచనలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుంది
- మనచుట్టూ ఉన్న గొప్పవారిని ప్రేరణగా తీసుకొని విద్యార్థులు ముందడుగు వేయాలి
- ఇన్నొవేషన్ ప్రాజెక్టులను ఇంక్యుబేషన్ చేసే ఆలోచనతో ఒప్పందాలు కదుర్చుకుంటున్నాం
- అభివృద్ధి వికేంద్రీకరణతో ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రాధాన్యత ఇస్తున్నాం
- ఇంక్యుబేషన్ మౌలిక వసతుల అభివృద్ధికీ ప్రభుత్వం కృషి
- రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు నారా లోకేశ్

**విజయవాడ:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉందని, విద్యార్థుల ఆలోచనలకు వాస్తవ రూపమిచ్చే ఫ్యాకల్టీ ఉందనే విషయం పాలీటెక్ ఫెస్ట్‌తో రుజువైందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.



మంగళవారం నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్స్‌లో జరుగుతున్న పాలీటెక్ ఫెస్ట్ (2024-25)లో మంత్రి పాల్గొని.. విద్యార్థుల టెక్ ప్రాజెక్టులను పరిశీలించారు.

ప్రతి ప్రాజెక్టు వివరాలను క్షుణ్ణంగా తెలుసుకొని, విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రతి స్టాల్‌ను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడుతూ వారి ప్రాజెక్టు ప్రత్యేకతలను అడిగి



తెలుసుకున్నారు. ప్రాజెక్టు తయారీలో తీసుకున్న మెళకువలను, దానికి అయిన ఖర్చును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలు, వాటి పని తీరు, వాటిని ఏర్పాటు చేయడంలో ముఖ్య ఉద్దేశాన్ని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పాలీటెక్ ఫెస్ట్ అనేది 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి ఆలోచన అని.. పిల్లలకు అద్భుత అవకాశాలు కల్పించాలని, వారిలో దాగున్న ప్రతిభను వెలికితీయాలనే ఆలోచనలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ప్రయాణం ఇక్కడితో ఆగకూడదని.. ఈ ఏడాది టెక్ ఫెస్ట్‌లోని ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.

అటానమస్ ఫెయిర్ డిటెక్షన్ అండ్ ఎక్స్‌ట్వింగిషర్ సిస్టమ్‌ను రూపొందించిన ఈశ్వర్, లక్ష్మీ శరణ్య పట్టుదల మిగిలిన విద్యార్థులకు ప్రేరణ అని పేర్కొన్నారు. ప్రయాణంలో ఒక్కోసారి ఎదురుదెబ్బలు తగులుతాయని.. వాటి నుంచి త్వరగా కోలుకోవడం అనేది ముఖ్యమన్నారు. దాదాపు 1,256 ప్రాజెక్టుల్లో 249 టాప్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌లో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఆ విద్యార్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వ సహకారం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో అద్భుతమైన ఆలోచనలకు నిజ రూపమిచ్చి రూపొందించిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు.

స్టీవ్‌జాబ్స్ వంటి వారు తమ లక్ష్యం కోసం చేసే ప్రయాణంలో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా చివరికి విజయం



సాధించారన్నారు. జోహో కార్పొరేషన్ శ్రీధర్ వెంబును మూడు నాలుగుసార్లు తాను కలిశానని.. గతంలో ఐటీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన్ను కలిసి తిరుపతికి డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకొచ్చినట్లు వివరించారు. కేవలం పట్టణాల్లోనే కాదు గ్రామాల్లోనూ ఉన్నత ప్రతిభ ఉన్న పిల్లలు ఉన్నారని ఆయన అనేవారని.. వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ముందుకెళ్లారన్నారు. ఇలా మనచుట్టూ అనేక మంది ఉన్నారని.. వారిని ఆదర్శంగా తీసుకొని మన సమాజం కోసం, మన కోసం, ప్రపంచంకోసం అవసరమైన ప్రొడక్ట్ తయారు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

మన ఐటీఐలు, పాలీటెక్నిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తయారుకావాలని.. దానికి మార్కెట్ లింకేజీ చాలాచాలా అవసరమని చెప్పానని.. అందులో భాగంగా దేశంలో అతిపెద్ద విండ్మిల్ మ్యానుఫ్యాక్చరర్ సుజ్లాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. కరిక్యులంతో పాటు రాబోయే రోజుల్లో ఇన్నొవేషన్ ప్రాజెక్టులను ఇంక్యుబేషన్ చేసే ఆలోచనతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఈ విధంగా మేకిన్ ఇండియా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని ఇన్నొవేషన్ ఆలోచనలను ఇంక్యుబేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

**ఈ ఫెస్ట్ అనేది ఒక ఈవెంట్ కాదు.. మూవ్‌మెంట్:**

ఈ పాలీటెక్ ఫెస్ట్ అనేది ఒక ఈవెంట్ కాదని.. మూవ్‌మెంట్ అని మంత్రివర్యులు పేర్కొన్నారు. గౌరవ ప్రధాని చెప్పే మేడిన్ ఇండియా అనేది చాలాచాలా ముఖ్యమని పేర్కొన్నారు. రాజధాని ఒకేదగ్గర ఉండాలి.. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి.. ఒక ఎకోసిస్టమ్ ఏర్పడాలనేది ప్రభుత్వ విధానమని.. అందుకే వెనుకబడిన అనంతపురం జిల్లాకు కియా మోటార్స్‌ను తీసుకొచ్చామన్నారు. ఇక్కడితో ఆగకుండా ఆటోమోటివ్ మొబిలిటీ రంగంలో అభివృద్ధికి ఆలోచన చేస్తున్నామన్నారు.

మరోవైపు కర్నూల్‌లో డ్రోన్‌హబ్‌గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. ప్రకాశం జిల్లాలో బయో ఫ్యూయల్స్ తయారీకి రిలయన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇలా ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఇంక్యుబేషన్ మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ద్వారా ప్రతి మేజర్ జిల్లాలో నోడ్స్ ఏర్పాటుచేసి మంచి ఆలోచనలున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే బాధ్యత మన ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఛాలెంజ్ అనేది జీవితంలో ఉండాలని దాంతోనే మనం జీవితంలో ఎదుగుతామని, అందుకు నా జీవితమే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఓటములు ఎదురైనా నిలబడి నమ్మిన దానికోసం పోరాడాలని, హార్డ్‌వర్క్‌ను నమ్ముకోవాలని సూచించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను, ఆలోచనలకు ప్రభుత్వం మద్దతిస్తుందని స్పష్టం చేశారు. వచ్చే అయిదేళ్లలో కనీసం ఒక్క యూనీకార్న్ కంపెనీ రాష్ట్రంలో రావాలనే ఆకాంక్షను మంత్రి వ్యక్తం చేశారు.

ఈ దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు గారు పదేపదే ఒక మాట చెప్పేవారని.. డేర్ టు డ్రీమ్ స్ట్రైవ్ టు అచీవ్ అని చెప్పేవారని, దీన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని మంత్రివర్యులు నారా లోకేశ్ అన్నారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు మంత్రివర్యులు సర్టిఫికేట్లు, బహుమతులు అందజేసి అభినందించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పాఠశాల, కాలేజీ విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు జి.గణేష్ కుమార్, సాంకేతిక శాఖ అధికారులు, రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన దిశగా అధికారులు పని చేయండి

- అధికారులు వారి ప్రతిభను సమస్యల పరిష్కారం పై పెట్టండి..
- రెవెన్యూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి...
- భూగర్భ జలాలు పెంపు నకు చర్యలు చేపట్టండి
- ఏకో టూరిజం అభివృద్ధి దిశగా చర్యలు
- సచివాలయ సిబ్బంది రేషనలైజేషన్ ప్రక్రియ ను పూర్తి చేయండి:
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**కుప్పం:** ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు అధికారులు అలసత్వం వీడి అంకిత భావంతో భాధ్యతతో పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా కుప్పం మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీలోని సెమినార్ హాల్‌లో జిల్లా అధికారులతో జిల్లా ప్రగతి పై సమీక్షించి అభివృద్ధి కొరకు తీసుకోవాల్సిన చర్యలు పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... ప్రభుత్వ సేవలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో చేరవేసేందుకు అధికారులు బాధ్యతతో పని చేయాలని, సుపరిపాలనను అందించేందుకు అధికారులు అలసత్వం వీడి పని చేయాలని తెలిపారు.ప్రధానంగా రెవిన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రణాళిక తో ముందుకు వెళ్లి



పరిష్కారం చూపాలన్నారు. గతంతో పోలిస్తే ఆర్డీఓ లకు మండలాల సంఖ్య తక్కువగా ఉంటుందని, వారి పరిధిలో రెవెన్యూ సమస్యలను పరిష్కారానికి చొరవ చూపి సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

రాష్ట్రంలో ప్రతి రిజర్వాయర్ నందు నీటి నిల్వలు కలవని జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల పెంపు నకు చెక్ డ్యామ్‌ల నిర్మా ణంనకు చర్యలు చేపట్టాలని డ్వామా అధికారులను ఆదేశించారు.

చిత్తూరు జిల్లాలో పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.జిల్లాలో ఏకో టూరిజం అభివృద్ధికి సంబంధిత శాఖలు సమిష్టిగా పని చేయాలన్నారు సచివాలయాల రేషన లైజేషన్ భాగంగా జనాభా ప్రాతిపదికన చేపట్టాలని, తద్వారా సిబ్బంది కొరతను నివారించవచ్చునని ఈ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

జిల్లాలో వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంట లైన కూరగాయలు పూలు పండ్లు పెంపకాలను ప్రోత్సహిం చాలన్నారు. కొత్త పంటల సాగుకు రైతుల ఆసక్తి చూపే విష యంలో అందుకు ఆ ప్రాంతాల్లో ఆ పంట సాగుకు అనుకూ లమైన వాతావరణం ఉన్నది లేనిది సరి చూసు కోవాలని ఆదే శించారు. గంజాయి నియంత్రణకు అటవీ పోలీసు అధికారులు ప్రత్యేక డ్రైవ్ ను చేపట్టి పగడ్బందీగా జాయింట్ యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు..

సమావేశంలో భాగంగా జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఆర్ డబ్ల్యూ ఎస్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల పురోగతి, వ్యవసాయ, ఉద్యాన శాఖల పురోగతి,వైద్య సేవలు సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ సమీక్షా సమావేశంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా ఎస్పీ మణికంఠ ఛందోలు, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, కడ పిడి వికాస్ మర్మత్, డీఎఫ్ఓ భరణి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివాని శ్రీనివాసులు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కుప్పం నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు..









**విశాఖలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా పార్టీ ఎంపి, ఎమ్మెల్యేలతో భేటీ అయిన బీజేపీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌జీ. చిత్రంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రి సత్యకుమార్ , ఎంపి సీఎం రమేష్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే సుజనాచౌదరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు. రాష్ట్రంలో జరిగిన పార్టీ సభ్యత్వాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.**

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 08, జనవరి 2025

## జరగబోయే పరిణామాలకు
# ప్రభుత్వానిదే బాధ్యత

**- కేంద్రమంత్రి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, మహానాడు:** తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం పైన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గూండాలు, రౌడీల్లాగా వ్యవహరిస్తూ.. రాళ్లతో, కర్రలతో చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది పిరికిపిందల చర్య. ఇలాంటి దుర్మార్గమైన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ తన తీరును మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నాను.

పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర బీజేపీ ఆఫీస్ గేటు వద్ద దాడికి పాల్పడటం దుర్మార్గం. బీజేపీ కార్యాలయం ముందు వరకు చేరుకుని రాళ్లు, కర్రలతో కాంగ్రెస్ గూండాలు పోలీసుల సమక్షంలో, పోలీసులతో



కలిసి వచ్చి ఆఫీస్ పైన, బీజేపీ కార్యకర్తలపైన దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు.

గతంలో సొంతపార్టీకి చెందిన ముఖ్యమంత్రులను గద్దెదించేందుకు మతకల్లోలాలు సృష్టించిన దుర్మార్గమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీ సొంతం. ఇలాంటి దాడులను ఆపక పోతే.. ఆ తర్వాత తలెత్తే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నాను. పోలీసుల సమక్షంలో బీజేపీ కార్యాలయంపై దాడిచేసి.. మా కార్యకర్తలను గాయపరిచే విషయం ముఖ్యమంత్రికి తెలియకుండా జరగదు.

ఖబడ్దార్, అసహనం కోల్పోయి మీరు చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు తిరగబడితే.. దేశంలో కాంగ్రెస్ కు ఉన్న కొద్దిపాటి నాయకులు తిరుగలేని పరిస్థితులు ఏర్పడుతాయి. రాష్ట్రంలో ఈ రకమైన దాడులతో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నాను.

మా సహనాన్ని అసమర్థతగా భావించొద్దు. మేం హింసా రాజకీయాలను ప్రోత్సహించం. అలాగని మాపై దాడులు చేస్తే సహించం. ఎవరి వ్యాఖ్యలైనా మీకు నచ్చకపోతే.. నిరసన తెలియజేయండి అంతే కానీ.. కార్యాలయంపై భౌతికంగా దాడి చేయడం, రాళ్లు, కర్రలతో దాడికి దిగడం సరికాదు. తన వ్యాఖ్యలకు ఢిల్లీకి చెందిన మాజీ ఎంపీ రమేశ్ భిదూరీ క్షమాపణలు చెప్పిన తర్వాత కూడా.. అసహనంతో దాడులు చేయడం సరైనదేనా?

గతంలోనూ ప్రధానమంత్రి గారికి పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక గాంధీ-నెహ్రూ కుటుంబసభ్యులు.. తీవ్ర అసహనంతో.. తక్కువ కులంవాడు, చాయ్ అమ్ముకునే వ్యక్తి ఎలా ప్రధాని అవుతారు, మౌత్ కా సౌదాగర్, హిట్లర్ వంటి ఎన్నో అవాకులు, చెవాకులు పేలారు. దీన్ని ఖండిస్తూ బీజేపీ ఎక్కడైనా దాడులు చేసిందా? మేం దీనికి ప్రతిగా సమాధానం చెబితే.. ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు దేశంలో రోడ్లపై తిరగలేడు. కానీ ఇది మా సంస్కృతి కాదు. మీ సంస్కృతిని మార్చుకోండి. ఖబడ్దార్.



**దాడికి రేవంత్ రెడ్డి అసదుద్దీన్ ఓవైసీ బాధ్యత వహించాలి : ఎంపీ రఘునందన్ రావు**



బిజెపి రాష్ట్ర కార్యాలయం పై గూండాలు రౌడీషీటర్లు కాంగ్రెస్ కార్యకర్తల ముసుగులో దాడి చేశారు ఈ దాడికి రేవంత్ రెడ్డి అసదుద్దీన్ ఓవైసీ బాధ్యత వహించాలి. నిన్న ఒకే వేదికపై ఓవైసీ సోదరులతో వేదిక పంచుకోగానే రేవంత్ రెడ్డి అక్కడే ఈ దాడికి పథకాన్ని రచించారు. గతంలో తమ సొంత ముఖ్యమంత్రిని దించడం కోసం చెప్పులు వేయడం మత కల్లోలాలు సృష్టించడం వారి చరిత్రలో భాగమే. నకిలీ గాంధీ కుటుంబ సభ్యుల కోసం ఇక్కడ కొందరు రౌడీషీటర్లు కాంగ్రెస్ ముసుగులో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు

తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా సన్నగిల్లిపోయినాయి గుండాలకు రౌడీషీటర్లకు ఉగ్రవాదులకు నక్సలైట్లకు పూర్తి స్వేచ్ఛని ఇచ్చి తెలంగాణను కుక్కలు చంపిన విస్తరి చేయమని సోనియా గాంధీ రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీలు చెప్పారా? బీజేపీ కార్యాలయంపై కార్యకర్తలపై నాయకులపై దాడులకు పిసిసి అధ్యక్షుడు ముఖ్యమంత్రి ప్రియాంక గాంధీ రాహుల్ గాంధీలు క్షమాపణ చెప్పాలి మా ఓపికను సహనాన్ని పరీక్షించాలి అనుకుంటే అది మీ ఇష్టం.

**పోలీసుల వైఫల్యం వల్లే దాడి**

**- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులు సంఘవిద్రోహకర కార్యక్రమాల కిందకు వస్తాయి. రాహుల్ గాంధీ రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతుంటారు. అసలు ఆయన రాజ్యాంగాన్ని చదివారా? రాజ్యాంగాన్ని చదవని, అనుసరించని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే ఇటువంటి దాడులకు పాల్పడుతుంటారు.



ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికి ఉంది. కానీ, రాజకీయ పార్టీ కార్యాలయాలపై, కార్యకర్తలపై దాడి చేసే అధికారం ఎవ్వరికీ లేదు. ఒక పథకం ప్రకారమే కాంగ్రెస్ పార్టీ ఈ దాడులకు పాల్పడింది.

ఒకవైపు అబిడ్స్ నుంచి, మరోదిక్కు గాంధీభవన్ నుంచి రెండువైపులా వందమందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు

## మీ ఇంటిలిజెన్స్ పనిచేస్తుందా లేదా?

**- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**



మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా లేదా ? మీ ఇంటిలిజెన్స్ పనిచేస్తుందా లేదా ? పార్టీ కార్యాలయాల మీద దాడి చేసే సంస్కృతి సిగ్గుచేటు. మీ పాలనలో ఈ రాష్ట్రాన్ని ఎటు తీసుకుపోదాం అనుకుంటున్నారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దు. గుండాల మాదిరిగా దాడిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే జరిగే పరిణామాలకు మీరే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఉన్న పార్టీ నాయకులపై దాడి చేసేందుకు వచ్చారు. పోలీసుల వైఫల్యం వల్లే భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. పోలీసులకు ఇంటెలిజెన్స్ రిపోర్టు ఉన్నప్పటికీ దాడికి ప్లాన్ చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి ఆఫీసు గేట్ వద్దకు వచ్చేవరకు నిలువరించలేదు. ఈ దాడి పోలీసులు, కాంగ్రెస్ పార్టీ కలిసి చేసినట్లుగా భావిస్తున్నాం. దాడిని ఖండిస్తున్నాం.

పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు చేతిలో ఇనుపరాడ్లు, రాళ్లు తీసుకువచ్చారు. ఈ దాడిలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర





అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కార్యకర్త నందు కి గాయాలయ్యాయి. దాడి చేసింది కాంగ్రెస్ కార్యకర్తలయితే.. పోలీసులు బిజెపి యువమోర్చా కార్యకర్తలను అరెస్ట్ చేయడం అన్యాయం.

పోలీసు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు భయపడుతున్నారు? ఇటువంటి దాడులకు పాల్పడి, తిరిగి కాంగ్రెస్ నాయకులే ఖండిస్తుండటాన్ని దుర్మార్గం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండొచ్చు. అలాగే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరిస్తున్నాం. అబద్ధాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీ నిరసన తెలపాలనుకుంటే బిజెపి ఆఫీసు గేట్ వరకు రాడ్లు, రాళ్లు ఎందుకు తీసుకొచ్చినట్లు? కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి.

# బీజేపీ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల రాళ్ల దాడి



(మొదటిపేజీ తరువాయి..)

చేశారు. దీంతో బీజేపీ నాయకులు కాంగ్రెస్ శ్రేణులపై తిరగబడటంతో.. కర్రలతో రెండు పార్టీల నాయకులు కొట్టుకున్నారు. ఈ దాడిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తలకు తీవ్రమైన గాయమయింది. వెంటనే క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.
బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీలో రోడ్లను ప్రియాంక గాంధీ బుగ్గలలా తయారుచేస్తామన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. మరోవైపు ఆప్ నేత అతిషిపై కూడా రమేష్ బిదురి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత గాంధీ భవన్ నుంచి నాంపల్లి బీజేపీ కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. బీజేపీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈలోపు బీజేపీ శ్రేణులు ప్రతిఘటించడంతో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ దాడిని బీజేపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు.

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందిస్తూ బీజేపీ శ్రేణులపై దాడిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


**మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఖబర్దార్: జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ**



బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ దాడి దుర్మార్గం. ఇలాంటి గుండా రాజకీయాలు సాగవు. మిస్టర్ రేవంత్ రెడ్డి ఖబర్దార్. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రాష్ట్ర పార్టీ కార్యాలయం మీద, మా కార్యకర్తల మీద దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి దాడులకు భయపడేది లేదు. ఈ ఘటన వెనుక రేవంత్ కుట్ర దాగుంది. ఈ ఘటనకు రేవంత్ బాధ్యత వహించాలి. పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహారించాలి, ఎవ్వరిని వదలొద్దు. జరిగిన ఘటనలో బాధ్యులను వెంట అరెస్ట్ చేయాలి.

## పోలీసుల ప్రేక్షకపాత్ర:

**ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, బిజెపి కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు గూండాలతో కలిసి దాడికి పాల్పడిన ఘటనను రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాడ్లు, కర్రలతో బిజెపి కార్యాలయానికి వస్తున్నారనే సమాచారం తెలిసినా, దాడికి పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మెప్పు పొందేందుకే పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని లక్ష్మణ్ మండిపడ్డారు. ఈ దాడులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పూర్తిబాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన వారిని గుర్తించి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. హింసాత్మక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ రాజకీయ సమాధికి గోతులు తవ్వుకున్నట్లేనన్నారు.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 08, జనవరి 2025




## దిల్‌రాజు, శిరీష్‌తో
# మరిన్ని సినిమాలు చేస్తా : వెంకటేష్

విక్టరీ వెంకటేష్, హిట్ మెషీన్ అనిల్ రావిపూడి, సక్సెస్ ఫుల్ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్లాక్ బస్టర్స కాంబినేషన్ లో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలైన మూడు పాటలు చార్ట్ బస్టర్స్‌గా మారడంతో థియేట్రికల్ ట్రైలర్ కోసం సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను సూపర్‌స్టార్ మహేష్ బాబు లాంచ్ చేశారు. నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో భారీగా తరలివచ్చిన అభిమానులు, ప్రేక్షకులు సమక్షంలో ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చాలా గ్రాండ్ గా జరిగింది. ఈ గ్రాండ్ ఈవెంట్ లో హీరో వెంకటేష్ స్టేజ్‌పై డ్యాన్స్ చేయడం అభిమానులు ఉర్రూతలూగించింది. ఓ ఇన్ఫ్లూయన్స్ వున్న వ్యక్తిని కిడ్నాప్ చేయడం చుట్టూ కథ తిరుగుతుంది, దాని గురించి వార్తలు బయటికి వస్తే ప్రభుత్వమే కూలిపోతుంది. దినిని నుంచి గట్టెక్కించగల ఎక్స్ పర్ట్ ని ప్రభుత్వం ఆశ్రయిస్తుంది. వెంకటేష్ ఎక్స్ పోలీసు, కంప్లీట్ ఫ్యామిలీ మ్యాన్. అతని భార్య భాగ్యం (ఐశ్వర్య రాజేష్ )తో ఆనందకరమైన జీవితాన్ని గడుపుతూ వుంటారు. వెంకటేష్ మాజీ ప్రియురాలు, పోలీసుగా ఉన్న మీనాక్షి చౌదరి కిడ్నాప్ కేసును ఛేదించడంలో సహాయం కోసం అతనిని సంప్రదించడంతో వారి ప్రశాంత జీవితానికి ఇబ్బంది కలుగుతుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మీ అందరినీ చూస్తుంటే చాలా ఆనందంగా వుంది. నిజామాబాద్ లో ట్రైలర్ లాంచ్ జరగడం చాలా హ్యాపీగా వుంది. మీ లవ్ అండ్ సపోర్ట్ కి థాంక్ యూ. నాకు ఎన్నో హిట్లు ఇచ్చారు. బొబ్బిలిరాజా, చంటి, గణేష్ , సీతమ్మ వాకిట్లో, ఎఫ్ 2, ఎఫ్ 3 ఇలా ఎన్నో విజయాలు ఇచ్చారు. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాంతో వస్తున్నాం. సంక్రాంతి సినిమా ఇంట్లో ప్రతి ఒక్కరూ వచ్చి చూడాలి. తప్పకుండా ఈ సినిమాని మీరు ఎంజాయ్ చేస్తారు. ఫుల్ అఫ్ ఎంటర్ టైన్మెంట్, సాంగ్స్.. ఇలా అనిల్ హెూల్సం ఎంటర్ టైనర్ ని ఇచ్చారు. మీ అందరికీ నచ్చుతుంది. మీ అభిమానం సంక్రాంతికి చూపిస్తారు. ఈ సినిమాలో పాటు గేమ్ చెంజర్ డాకు మహారాజ్ అన్నీ పెద్ద హిట్లు కావాలని కోరుకుంటున్నాను. దిల్ రాజు బ్యానర్ లో చేసిన నాలుగు సినిమాలు సూపర్ హిట్లు అయ్యాయి. దిల్ రాజు, శిరీష్ గారితో మరిన్ని సినిమాలు చేయాలని వుంది. అనిల్ థాంక్ యూ వెరీ మచ్. ఐశ్వర్య, మీనాక్షి చాలా అద్భుతంగా పెర్ఫారం చేశారు. పెళ్ళాలకి మీ ఫ్లాష్ బ్యాకులు చెప్పొద్దు(నవ్వుతూ). సినిమా చూడండి. మామూలుగా వుండదు. అందరికీ థాంక్ యూ' అన్నారు.

# "గాలి ఊయలలో" జీవా..రాశిఖన్నా

ఫాంటసీ-హారర్-థ్రిల్లర్ విజువల్ మాస్టర్ పీస్ అగాతియా ఫస్ట్ సింగిల్ గాలి ఊయలలో రిలీజ్ చేశారు మేకర్స్. ఇది సంగీత, సినీ ప్రేమికులకు మరపురాని అనుభూతిని కలిగిస్తుంది. మాస్ట్రో యువన్ శంకర్ రాజా స్వరపరిచిన ఈ ట్రాక్ అద్భుతమైన విజువల్స్‌తో పాటు 2025లో బిగ్గెస్ట్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని వాగ్దానం చేసే మెలోడీలను బ్లెండ్ చేసింది. గాలి ఊయలల్లో మిస్టరీ, ఎమోషన్స్ ఎసెన్స్ ని అందిస్తోంది. ఇళయరాజా సిగ్నేచర్ పియానో పీస్‌తో ప్రారంభమైన ఈ పాట, మరుపురాని అనుభూతిని అందిస్తూ, ఒక సోల్ ఫుల్ మెలోడీగా అలరిస్తోంది. యువన్ శంకర్ రాజా, మెలోడీలలో మాస్టర్, శ్రోతలను లోతుగా ఆకట్టుకునే పాటని రూపొందించారు. శ్రీధర్ మాస్టర్ కొరియోగ్రఫీ, దీపక్ కుమార్ పాడి అందించిన ఉత్కంఠభరితమైన సినిమాటోగ్రఫీ ఈ పాటను విజువల్ ట్రీట్‌గా నిలిపాయి.

దర్శకుడు, పాటల రచయిత పా.విజయ్ మాట్లాడుతూ "ఈ పాట కేవలం మెలోడీ కాదు-ఇది ఒక ప్రయాణం. ఇది ఇళయరాజామ బీథోవెన్‌ల ప్రతిభను కలిగి ఉండాలని నేను కోరుకున్నాను. నేను ఈ ఐడియాను యువన్‌కి అందించగా, అతను కేవలం 10 నిమిషాల్లో మ్యాజిక్ సృష్టించాడు. ఇది టైమ్‌లెస్ ట్యూన్‌లు, మోడ్రన్ సెన్సిబిలిటీల సమ్మేళనం' అన్నారు. యువన్ శంకర్ రాజా తన అనుభవం గురించి చెబుతూ.. "పా.విజయ్‌తో కలిసి పనిచేయడం ఎప్పుడూ ప్రత్యేకమే. మేము కలిసి 300 పాటలకు పైగా పని చేసాము. గాలి ఊయలలో మా నాన్నగారి పియానో పీస్ , బీథోవెన్ ట్యూన్‌ను చేర్చడం గురించి అతను చెప్పినప్పుడు, నేను థ్రిల్ అయ్యాను. ఇది నా అత్యుత్తమ మెలోడీలలో ఒకటి అని నేను నిజంగా నమ్ముతున్నాను.'అన్నారు



# గ్రిప్పింగ్ యాక్షన్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఎప్పుడంటే?

ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్, కోలీవుడ్ సూపర్ స్టార్ అజిత్ కుమార్ తో వారి అప్ కమింగ్ మల్టీ లింగ్వెల్ వెంచర్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ హైప్రొఫైల్ ప్రాజెక్ట్ ఇప్పటికే పోస్టర్‌లతో అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. మైత్రీ మూవీ మేకర్స్ తమిళ చిత్రసీమలోకి ప్రవేశిస్తున్నందున, ఈ స్టార్-స్టడెడ్ ప్రాజెక్ట్ కోసం అంచనాలు భారీగా ఉన్నాయి, ఇది గ్రిప్పింగ్ యాక్షన్, ఆకట్టుకునే డ్రామా బ్లెండ్ గా వుంటుంది. అజిత్‌ని క్రేజీ అవతార్‌లో చూడటానికి అభిమానులు ఎదురు చూస్తున్నారు. మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఏప్రిల్ 10, 2025న విడుదలవుతున్న ఈ చిత్రం వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో, అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అదరగొట్టారు. చేతిలో తుపాకీతో సోఫాలో కూర్చున్న అతను, ఇంటెన్సిటీ, సస్పెన్స్‌తో కూడిన పెర్ఫార్మెన్స్ అందిస్తానని హామీ ఇచ్చారు. మార్క్ ఆంటోని విజయం తర్వాత, స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌లను రూపొందించడంలో నైపుణ్యం కలిగిన దర్శకుడు అధిక్ రవిచంద్రన్, అజిత్ కుమార్‌ను మల్టీ -లేయర్డ్ పాత్రలో చూపించబోతున్నారు.



# యువ హీరోగా ఇండస్ట్రీలో నాకో స్థానం కల్పించారు : హీరో ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. గత డిసెంబర్ 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన "డ్రింకర్ సాయి" సినిమా యునానమస్‌గా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. "డ్రింకర్ సాయి" సినిమా యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రత్యేక ప్రదర్శనను మీడియా మిత్రుల కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో ధర్మ మాట్లాడుతూ - "డ్రింకర్ సాయి" సినిమాను ఆదరించడం ద్వారా చిత్ర పరిశ్రమలో యువహీరోగా నాకో స్థానం కల్పించారు ప్రేక్షకులు. వారికి నేను కృతజ్ఞతలు చెబుతున్నాను. కొత్తవాళ్లకు ఇండస్ట్రీలో ప్రోత్సాహం ఉండదు అనేది తప్పని మీరంతా ప్రూవ్ చేశారు. హీరోగా నన్నెంతో ఎంకరేజ్ చేశారు. ఇలాంటి మంచి మూవీ నాతో చేసిన డైరెక్టర్ కిరణ్ గారికి, నిర్మాతలకు థ్యాంక్స్. మీడియా మిత్రులకు ఫ్యామిలీతో కలిసి చూసేలా "డ్రింకర్ సాయి" షో వేయాలని అనుకున్నాం. అందుకు మీ దగ్గర నుంచి వచ్చిన సపోర్ట్ సంతోషంగా ఉంది. మీరంతా సినిమా చూసి మీ ప్రశంసలు అందించడం హ్యాపీగా ఉంది. మీరు చెప్పినవన్నీ నా మనసులో ఉంచుకుని నా ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ ప్లాన్ చేసుకుంటాను. ఇంకా పెద్ద సక్సెస్ ఫుల్ సినిమా కోసం ప్రయత్నిస్తూనే ఉంటాను. అన్నారు.





# శివకార్తికేయన్ లాంచ్ చేసిన కింగ్‌స్టన్

నేషనల్ అవార్డ్ విన్నింగ్ కంపోజర్, ట్యాలెంటెడ్ యాక్టర్ జివి ప్రకాష్ కుమార్ కంటెంట్-బేస్డ్ మూవీ 'కింగ్స్టన్'లో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని స్టార్ హీరో శివకార్తికేయన్ లాంచ్ చేశారు. ఫస్ట్ లుక్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. జీ స్టూడియోస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఉమేష్ కె.ఆర్.బన్సాల్ మాట్లాడుతూ.."ప్రేక్షకులకు ప్రత్యేకమైన, ఆకట్టుకునే కథలను అందించడంలో మా నిబద్ధతకు కింగ్స్టన్ నిదర్శనం. జివి ప్రకాష్ కుమార్ అద్భుతమైన ప్రతిభ, విజన్ గల టీంతో, ఈ ఫాంటసీ అడ్వంచర్ సముద్రపు నేపథ్యాలు వీక్షకులను ఆకట్టుకునేలా వుంటుంది" అన్నారు. కొత్త దర్శకుడు కమల్ ప్రకాష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జివి ప్రకాష్, దివ్య భారతి లీడ్ రోల్స్ పోషించారు, ఇందులో 'మెర్కు తొడార్చి మలై' ఫేమ్ ఆంటోని, చేతన్, కుమారవేల్, & సాబు మోహన్‌లతో పాటు పలువురు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ధివేక్ ఈ చిత్రానికి డైలాగ్స్ రాశారు. ఎడిటింగ్ పనులను శాన్ లోకేష్ పర్యవేక్షిస్తుండగా, ఆర్ట్ డైరెక్టర్‌గా ఎస్.ఎస్.మూర్తి పనిచేస్తున్నారు. హారర్-అడ్వెంచర్ జానర్‌కి చెందిన ఈ చిత్రానికి దిలీప్ సుబ్బరాయన్ మైండ్ బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్‌లకు కొరియోగ్రఫీ చేశారు, దీనిని జీ స్టూడియోస్, పారలల్ యూనివర్స్ పెద్ద కాన్వాస్‌పై నిర్మించాయి. దినేష్ గుణ క్రియేటివ్ ప్రొడ్యూసర్.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144